TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

www.telanganamuchatlu.in

వరంగల్ సంపుటి : 2 సంచిక : 42 శనివారం 27 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in




# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టులో విచారణ



హైదరాబాద్ (అక్టోబర్ 25) : ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పిల్ దాఖలైంది ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఈ పిల్‌ను దాఖలు చేశారు. పార్టీ పర్సన్‌గా వాదనలను కేఏ పాల్ వినిపించారు. కేఏ పాల్ వాదనలు విన్న తర్వాత ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 4వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. తెలంగాణ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హత్యాచారులపై హైకోర్టులో మరో పిల్ దాఖలైంది. ఈ పిల్‌ను కూడా కేఏ పాల్ దాఖలు చేశారు. కేఏ పాల్ వాదనలను వినిపించారు. వాదనలు విన్న అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 4వ తేదీకు హైకోర్టు వాయిదా వేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత

మిగతా 2లో...

# రేవంత్ నీ సవాల్‌ను స్వీకరిస్తున్నా..

## అందుకు మేము సిద్ధమే



హైదరాబాద్, (అక్టోబర్ 25) : మూసీ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్న వారు మూడు నెలల పాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటే ప్రాజెక్టును విరమించుకుంటానంటూ ముఖ్యమంత్రి రేవంత్ చేసిన సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ ప్రాంతాల్లో పేదల ఇళ్ల కూల్చివేతలకు వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద బీజేపీ మహాధర్నాను చేపట్టింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... "సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల కోసం వారి ఇళ్లలో నివాసం ఉండేందుకు మేము సిద్ధం" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తి కావస్తోందని.. నిరుపేదలకు ఇచ్చేందుకు ఏ ఇంటికి రేవంత్ సర్కార్ శంకుస్థాపన చేయలేదని, భూమి పూజ చేయలేదని విమర్శించారు. కొత్తగా ఇవ్వకపోగా ఏండ్లుగా నివసిస్తున్న నిరుపేదల ఇండ్లను కూలుస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని.. ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను గారడీలుగా మార్చి మసి పూసి మారేడుకాయ చేశారన్నారు. ప్రజలను సోనియా, రాహుల్, రేవంత్ మభ్యపెట్టారని విమర్శించారు.

మిగతా 2లో...




# ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన

అమరావతి, (అక్టోబర్ 25) : సూపర్ సిక్స్ పథకాల్లో ముఖ్యమైన ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ పథకంపై మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. ఆర్ధిక భారం లేకుండా వీలైనంత త్వరగా ఈ పథకాన్ని అమలు చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలను కోరుకుంటున్నారని దీనికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు,

2లో

# భద్రాచలం రాములోరిని దర్శించుకున్న గవర్నర్


▸ ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వచనం



భద్రాచలం, (అక్టోబర్ 25) : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకున్నారు.

మిగతా 2లో...

# మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయ



- ఇకముందు ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దు
- పరువు నష్టం కేసు విచారణ వచ్చే నెల 21కి వాయిదా

హైదరాబాద్, (అక్టోబర్ 25) : మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు మొట్టికాయలు వేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం కేసులో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సురేఖ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని మండిపడింది. ఓ బాధ్యత కలిగిన మహిళా మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిదని వ్యాఖ్యానించింది. అలాంటి వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని తెలిపింది. ఆమె వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ ఎలాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని ఆదేశించింది. ఇంకెప్పుడూ కేటీఆర్ గురించి అడ్డగోలు వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేసింది. మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వేసిన పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టులో విచారణ జరిగింది. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను న్యూస్ ఛానళ్లు, యూట్యూబ్, సోషల్ మీడియాలో

2లో

# 'జనం నోటా ఒకటే స్లోగన్..

## వద్దురా నాయన కాంగ్రెస్ పాలన'... కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్ (అక్టోబర్ 25) : దద్దమ్మ పాలనలో ధర్నాలతో తెలంగాణ రాష్ట్రం దద్దరిల్లుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ఈమేరకు ఎక్స్(ట్విట్టర్)లో కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. దిక్కుమాలిన పాలనలో ప్రజల జీవితాలు దిక్కుమొక్కు లేకుండా పోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలంపూర్ నుంచి మొదలు పెడితే ఆదిలాబాద్ వరకు.. గ్రామ సచివాలయం నుంచి మొదలు రాష్ట్ర సచివాలయం వరకు.. రైతు నుంచి మొదలు రైస్ మిల్లర్ల వరకు.. కార్మికుని నుంచి మొదలు కాంట్రాక్టర్ల వరకు.. టీచర్ల నుంచి మొదలు పోలీస్ కుటుంబాల వరకు.. అవ్వాతాతల నుంచి మొదలు ఆడబిడ్డల వరకు.. విద్యార్థుల నుంచి మొదలు విద్యావంతుల వరకు.. నిరుద్యోగుల నుంచి మొదలు ఉద్యోగుల వరకు..కాంగ్రెస్ ప్రజాపతినిధుల నుంచి మొదలు ప్రతిపక్ష నాయకుల వరకు... ఒక్కరా ఇద్దరా.. ముగ్గురా మూలకున్నా ముసలవ్వ మొదలు బడిపిల్లల దాక ధర్నాలు నిరసనలు చేస్తున్నారని చెప్పారు. "జనం నోటా ఆడా ఇడా అంతటా ఒకేటే స్లోగన్ వద్దురా నాయన కాంగ్రెస్ పాలన" అని విమర్శించారు. ముందు దగా-వెనక దగా.. కుడి ఎడమల దగా.. దగా .. కాంగ్రెస్

2లో

# ఇంతకంటే కాస్ట్‌లీ ప్రాజెక్టు.. కాస్ట్ లీ స్కామ్ ఎక్కడా లేదేమో



హైదరాబాద్, (అక్టోబర్ 25) : "మొన్నటి వరకు హైడ్రా జరిగింది.. ఆ బాధితుల్లో జేసీబీ, బుల్డోజర్లు అనే భయం కనిపించాయి. ఇప్పుడు మూసీ బాధితులను చూస్తుంటే వారిలో బీజేపీ ఉందనే భరోసా కనిపిస్తోంది. కాంగ్రెస్ విధానాలపై ప్రజలకు అండగా ఉండి బరా బర్ కొట్లాడుతాం" అని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మూసీ ప్రాంతాల్లో పేదల ఇళ్ల కూల్చివేతలకు

మిగతా 2లో...

# తీరం దాటిన దానా



విశాఖపట్నం, (అక్టోబర్ 25) : ఆంధ్రప్రదేశ్‌కు దానా తుపాన్ ముప్పు తప్పిందని విశాఖపట్నంలోని వాతావారణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ఒడిశా పూరి సమీపంలోని ధమ్రా, హబలి ఖాతి మధ్య తీరాన్ని

2లో

# వైఎస్ఆర్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ




అమరావతి, (అక్టోబర్ 25) : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల. వైఎస్ఆర్ అభిమానులకు సంచలన లేఖ రాశారు. 3 పేజీల బహిరంగ లేఖ రాసిన ఆమె.. అందులో సంచలన విషయాలు వెల్లడించారు. సాక్షి పేపర్, ఛానెల్‌లో తనపై ప్రసారం చేస్తున్న వార్తలపై క్లారిటీ ఇస్తూ.. ఇవీ వాస్తవాలంటూ కీలక వివరాలను వెల్లడించారు. మరి ఆ లేఖలో షర్మిల ఏం రాశారు. ఏం పేర్కొన్నారు. జగన్ గురించి ఎలాంటి విషయాలు బహిర్గతం చేశా రు. తెలియాలంటే ఈ కథనం చదవాల్సిందే..వైఎస్ షర్మిల లేఖలోని వివరాలు యధావిధిగా

మిగతా 2లో...

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# సంపాదకీయం

## 'లడ్కీ బహిన్' గెలుపు గుర్రమేనా?

వచ్చే నెల 20న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలే కాదు, యావద్దేశ జనులూ ఆ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయనే ఉత్కంఠతో ఉన్నారు. ఇప్పుడు మహారాష్ట్రలోను, విశాల భాతదేశంలోను ప్రజల పిచ్చాపాటీలో రెండు మాటలు ప్రధానంగా వినపడుతున్నాయి. అవి: 'లడ్కీ బహిన్'. అది ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం సరికొత్తగా అమలుపరుస్తున్న 'సంక్షేమ' పథకం. దాని కింద సంవత్సరాదాయం రూ. రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్న ప్రతి కుటుంబానికి నెలా నెలా ఆ కుటుంబ గృహిణికి రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇప్పుడు ఈ ఉదార ఆర్థిక హాయమే చర్చనీయాంశంగా ఉన్నది. అయితే అది ఒక నిర్ణాయకమైన రాజకీయ ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నది: గత ఆగస్టు నుంచి రెండు కోట్ల మందికి పైగా మహిళల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్న డబ్బు పాలక మహాయుతి కూటమి ప్రభుత్వంపై ప్రబలంగా ఉన్న ప్రజా వ్యతిరేకతను తొలగించగలదా? రాష్ట్రాలలో గానివ్వండి లేదా కేంద్రంలో గానివ్వండి అధికారంలో ఉన్న ఏ పార్టీ ప్రభుత్వమైనా ఎన్నికల ముందు నిర్దిష్ట సామాజిక సమూహాలకు నగదు సహాయం పేరిట లంచాలు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. అయితే ఇందుకు ముందెన్నడూ ఇంత హఠాత్తుగా, నిస్సిగ్గుగా, ఆర్థిక పర్యవసానాలను పట్టించుకోకుండా ఓటర్లకు ప్రత్యక్ష నగదు చెల్లింపులు చేయడం జరగలేదు. నవంబర్ 20న తమ ఓటు వేసేనాటికి లడ్కీ బహిన్ లబ్ధిదారులు అయిన మహిళల బ్యాంకు ఖాతాల్లో దీపావళి బోనస్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాకముందు చివరి నిమిషంలో ప్రకటించారు)తో సహా రూ.7500 జమ అవుతాయి. ఈ ఉదార ఆర్థిక సహాయం అందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నెలసరిన ఇంచుమించు రూ.3700 కోట్లు వెచ్చించనున్నది. వార్షికంగా రూ.46 వేల కోట్ల భారం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్నది. మరి మహారాష్ట్ర ప్రభుత్వ రుణ భారం ఇప్పటికే రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నదని అంచనా ఎన్నికల ముందు మహాయుతి ప్రభుత్వ 'టిజోరి ఖోలో' (ప్రభుత్వ ఖజానాను తెరువడం) రాజకీయాల మూలంగా ఆ రుణ భారం మరింతగా పెరగనున్నదని సీనియర్ బ్యూరాక్రాట్ ఒకరు అన్నారు. లడ్కీ బహిన్ యోజనను మూడు విధాలుగా చూడవచ్చు. ఒకటి- ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అగాఢీని చిత్తుచేసేందుకు ఉద్దేశించిన తెలివైన రాజకీయం. 2024 లోక్‌సభ ఎన్నికలలో పాలక మహాయుతి కూటమి రాష్ట్రంలోని 48 సీట్లలో కేవలం 17ను మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ కారణంగా కీలక ఓటర్ల బృందాలను ఆకట్టుకోవడానికై కొత్త మార్గాలను అనుసరించేందుకు ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి అనివార్యమయింది. మహిళలు, యువత లక్ష్యిత ఓటు బ్యాంకులు కదా. మహిళలకు లడ్కీ బహిన్ పేరిట నేరుగా నగదు సహాయం అందించేందుకు, ఆర్థిక తోడ్పాటు అవసరమైన నిరుద్యోగ యువతకు 'లడ్కా భావు' పేరిట నగదు సహాయం చేసేందుకు షిండే సర్కార్ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమి 'సంవిధాన్ ఖత్రే మే హై' (ప్రమాదంలో రాజ్యాంగం) అనే నినాదంతో గణనీయమైన విజయాలు సాధించగా ఇప్పుడు షిండే ప్రభుత్వం నగదు ఆధారిత పథకాలను శాసనసభ ఎన్నికల ప్రధాన ప్రచారాంశంగా చేయడంలో కనీసం తాత్కాలికంగా సఫలమయింది. పై దృక్కోణానికి ప్రత్యామ్నాయంగా లడ్కీ బహిన్‌ను పూర్తిగా అనైతిక పద్ధతులలోనైనా సరే అధికారాన్ని కైవసం చేసుకోవడమే ధ్యేయమైన క్షుద్ర రాజకీయాలకు చిహ్నంగా చూసితీరాలి. ఇదే అందరినీ అమితంగా వ్యాకులపరుస్తున్న పరిణామం. గత ఐదేళ్లుగా మహారాష్ట్ర దేశంలోనే ఎక్కడా లేని రీతిలో రాజకీయ అస్థిరత్వంతో కుదేలైపోతోంది. ఈ ఐదేళ్లలో మూడు ప్రభుత్వాలు మారాయి. ఒక ముఖ్యమంత్రిని తెల్లవారుజామున గుట్టు చప్పుడు కాకుండా ప్రమాణ స్వీకారం చేయించారు. రెండు ప్రాంతీయ పార్టీలు చీలిపోయాయి. ధనరాశుల, మంత్రి పదవుల ప్రలోభంతో ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారు. భారత రాజకీయాల సంపూర్ణ నైతిక పతనానికి మహారాష్ట్ర అద్దం పట్టింది. 'వాషింగ్ మెషీన్', 'ఖోఖె చి సర్కార్' (ఒక 'ఖోఖా' ఒక కోటికి సమానం) అనేవి ఇప్పుడు మహా రాష్ట్రీయుల రాజకీయ పరిభాషలో అంతర్భాగంగా ఉన్నాయి. ధన బలం, రహస్య బేరసారాలు, ఒప్పందాలు రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా భ్రష్టపరిచాయి. భావజాలం ఏదైతేనేమి రాష్ట్ర శాసనసభ్యులలో మూడోవంతు మంది గత 15 ఏళ్లలో ఒకటి కంటే ఎక్కువ పార్టీలలో ఉన్నవారే! లడ్కీ బహిన్ లాంటి నగదు సహాయం పథకాలను స్పర్థాత్మక 'రేవడి' రాజకీయాలుగా చూడడం మూడో దృక్కోణం (ఇదే చాలా తార్కికమైనది). ఇవి, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర హానికరమైనవి అనవచ్చు. అనడమేమిటి, అలా నిరూపితమయ్యాయి కూడా. 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉచితాల సంస్కృతికి వ్యతిరేకంగా ఓటర్లను హెచ్చరించారు. రాజకీయ పార్టీలు వాగ్దానం చేస్తున్న ఉచితాలు దేశ ఆర్థిక వ్యవస్థకు చాలా ప్రమాదకరమైనవి అని ఆయన స్పష్టం చేశారు 'రేవడి' సంస్కృతిని పెంచుతున్నవారు ప్రజలకు ఉచిత కానుకలు పంపిణీ చేయడం ద్వారా వారిని తమ స్వప్రయోజనాలకు కొనుగోలు చేసుకోవచ్చని విశ్వసిస్తున్నారని మోదీ గర్హించారు. 'మనమందరమూ సమైక్యంగా ఇటువంటి ఆలోచనలను అరికట్టాలి. దేశరాజకీయాల నుంచి రేవడి సంస్కృతిని తొలగించాల్సిన అవసరం జరూరుగా ఉందని' ప్రధాన మంత్రి ఘోషించారు.

## తీరం దాటిన దానా

దాటిందని తెలిపింది. తీవ్ర తుఫాను క్రమంగా బలహీనపడి తుఫాన్‌గా కొనసాగుతుందని వివరించింది. అయితే ఉత్తర ఒడిశాలోని భద్రక్ సమీపంలో తుపాన్ ప్రభావం ప్రస్తుతం కొనసాగుతుందని వివరించింది. తుపాన్.. ఉత్తర వాయువ్య దిశగా కదిలి, క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండం మారనుందని పేర్కొంది. అయితే తుపాన్.. తీరం దాటిన సమయంలో సుమారు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ఉత్తర కోస్తాలో చెదురు మదురుగా వర్షపు జల్లులు పడ్డాయని పేర్కొంది. ఇక అన్ని పోర్టులకు జారీ చేసిన హెచ్చరికలను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇక ఉత్తర కోస్తాపైన ప్రస్తుతం గాలుల ప్రభావం కొంత వరకు ఉంటుందని చెప్పింది. ప్రస్తుతం ఉత్తర ఒడిశాలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని విశాఖపట్నంలోని వాతావరణ శాఖ వివరించింది. అలాగే ఉత్తరాంధ్రలో వాతావరణం మేఘావృతంగా ఉంటుందంది. ఉత్తర, దక్షిణ కోస్తాలో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్నిచోట్ల చాలా తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురువొచ్చని తెలిపింది. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ స్పందిస్తూ.. హబాలి ఖాతి నేచర్ క్యాంప్, ధమ్రాకు సమీపంలో తుపాన్ 'దానా' తీరం దాటిందని తెలిపారు. గతరాత్రి 1:30 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము 3:30 గంటల మధ్య దానా తుపాన్ తీరం దాటిందన్నారు. ల్యాండ్ ఫాల్ ప్రక్రియ మరో 2 నుంచి 3 గంటల పాటు కొనసాగుతుందని చెప్పారు. ఇది పశ్చిమ - వాయువ్య దిశగా కదులుతూ మధ్యాహ్నం నుంచి క్రమంగా బలహీనపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోణంకి కూర్మనాథ్ సూచించారు.

## ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు మేరకు ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందజేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్ల పథకంపై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన కేబినెట్‌లో ఆమోదం లభించిందన్నారు. శాఖల వారీగా చర్చించి ఆయిల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న సుమారు కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్‌లకు ఏ విధంగా అందుబాటులోకి తేగలుగుతాం అనే దానిపై అధ్యయనం చేశామన్నారు. ఆర్థిక భారం లేకుండా వీలున్నంత త్వరగా పథకం అమలు చేస్తామని స్పష్టం చేశారు. నేడు ఈ పథకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 31 డెలివరీ రోజుగా పెట్టుకొని మొదటి సిలిండర్ మార్చి 31 వరకూ ఎప్పుడైనా పొందవచ్చన్నారు. ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందేందుకు అర్హత కలిగిన ఎల్పీజీ కనెక్షన్ ఉండాలని, తెల్ల రేషన్ కార్డు ఉండాలని అలాగే ఆధార్ కార్డు ఉండాలని తెలిపారు.

సీఎం చేతుల మీదుగా...

29వ తేదీన ఉదయం 10 గంటల నుంచి బుకింగ్స్ ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 30న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఇప్పిస్తామని.. బుకింగ్ కన్ఫం అవ్వగానే ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఒకటి బుక్ అయ్యిందని ఎస్ఎమ్ఎస్ వెళుతందన్నారు. మూడు ఆయిల్ కంపెనీలతో జరిగిన చర్చను బట్టి 24 నుంచి 48 గంటల్లోపు డెలివరీలు పూర్తవుతాయన్నారు. గ్యాస్ సిలిండర్ అందించిన క్షణం నుంచి 48 గంటల్లోపు వారి ఖాతాల్లోకి అమౌంట్ జమ అవుతుందన్నారు. రూ.894.92 కోట్లు ఆయిల్ కంపెనీలకు 29న అందిస్తామన్నారు. కేంద్రం ఎలా డీబీటీ ద్వారా ఇస్తుందో అలాగే తాము కూడా డీబీటీ ద్వారా పంపిణీ చేయాలని కోరారన్నారు. వచ్చే సిలిండర్ నాటికి నేరుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచే ఈ నిధులు అందిస్తామని వెల్లడించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.2674 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఈ పథకం ద్వారా ఖర్చు అవుతుందని తెలిపారు. ఎవ్వరికైనా పథకం అందకపోతే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని మంత్రి నాదెండ్ల

## వైఎస్ఆర్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ..

'ఈ రోజు పొద్దున సాక్షి పేపర్ చూశాను. సాక్షి మీడియా జగన్ మోహన్ రెడ్డి గారి చేతిలో ఉంది. కాబట్టి ఏదైనా నమ్మించగలడు. అయినా అభిమానులకు అసలు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నం నాది. అమ్మ వైఎస్ విజయమ్మ, నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి గురించి ఒక పుస్తకం రాశారు. అందులో నాన్న గురించి ప్రత్యేకంగా ఒక మాట రాశారు. 'రాజశేఖర్ రెడ్డికి లోకమంతా ఒకెత్తయితే', తన బిడ్డ షర్మిల ఒకెత్తు అని రాశారు. నాన్నకు నేనంటే ప్రాణం. నాన్న నన్ను ఎప్పుడూ ఆడపిల్ల కదా అని చిన్న చేసో, తక్కువ చేసో చూడలేదు. నాన్న బ్రతికి ఉన్నన్ని రోజులు ఒకే మాట అనేవారు. 'నా నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ నాకు సమానం'. వైఎస్ఆర్ బ్రతికి ఉండగా స్థాపించిన అన్ని కుటుంబ వ్యాపారాల్లో, నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కి సమాన వాటా ఉండాలి. రాజశేఖర్ రెడ్డి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలే. అవి జగన్ మోహన్ రెడ్డి సొంతం కాదు. ఉన్న అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ 'గార్డియన్' మాత్రమే. అన్నీ వ్యాపారాలు నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచి పెట్టలనేది జగన్ మోహన్ రెడ్డి భాధ్యత. ఇది రాజశేఖర్ రెడ్డి మేండేట్. వైఎస్ఆర్ ఈ ఉద్దేశ్యాన్ని ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, సన్నిహితులందరికి, స్పష్టంగా తెలిసిన విషయం.

## ఇంతకంటే కాస్ట్‌లీ ప్రాజెక్టు.. కాస్ట్ లీ స్కామ్ ఎక్కడా లేదేమో

వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద బీజేపీ మహాధర్నాలో బండి సంజయ్ పాల్గొని ప్రసంగించారు. మూసీ ఒకప్పుడు మంచినీళ్లు అందించిందని.. ఇప్పుడు విషం కక్కుతోందన్నారు. "నేను పాదయాత్ర చేసినప్పుడు కళ్లారా చూశా. మూసీ సర్వ నాశనం కావడానికి కారణం కాంగ్రెస్. పరిశ్రమలకు అడ్డగోలుగా పెట్టుకోవాలని చెప్పి అనుమతి ఇచ్చింది వారు కాదా. మొన్న రేవంత్ లండన్ పోయి ఒక నది చూశాడు.. అది చూసే లక్షన్నర కోట్లు అన్నాడు. నిన్న సియోల్‌కు నేతలను పంపాడు.. వాళ్ళు ఎంత చెప్తారో మరి. రేవంత్.. ముందు మంత్రులను మూసీ పరివాహక ప్రాంతాల్లో తిరగమను. అలా వెళ్తే ప్రజలు వాళ్ళను గంప కింద కుమ్ముతారనే భయం రేవంత్‌కు ఉంది. రేవంత్ మొన్న మూసీ సుందరీకరణ అని ఒకసారి అంటాడు.. పునరుజ్జీవనం అని ఒకసారి అంటాడు.. ఏంటో ఆయనకే క్లారిటీ లేదు. లక్షన్నర ఖర్చు అన్నాడు.. మళ్ళీ నేను అనలేదు అంటున్నాడు. మూసీ ప్రక్షాళన పేదల కోసం కాదు.. ఇదంతా కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా అల్లుడి కోసమే. బీఆర్ఎస్ నేతలకు దీనిపై మాట్లాడే హక్కు లేదు.. వారిది నోరా.. మోరా" అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరు గ్యారెంటీలను డైవర్ట్ చేసేందుకే హైడ్రా, మూసీ అంటూ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఒక డ్రామా కంపెనీ అని.. ఆ పార్టీలో ఎవరికీ వారు సీఎంలంటూ సెటైర్ విసిరారు. సబర్మతి ఖర్చు రూ.7 వేల కోట్లు అని, నమామి గంగ ఖర్చు రూ.40 వేల కోట్లు అయితే మూసీకి లక్షన్నర కోట్లా అని ప్రశ్నించారు. ఒక్క కిలోమీటర్‌కు 2 వేల కోట్లా అని నిలదీశారు. ఇంతకంటే కాస్ట్‌లీ ప్రాజెక్టు.. కాస్ట్ లీ స్కామ్ ప్రపంచంలో లేదన్నారు. దోషులు ప్రజలు కాదు.. అక్రమంగా కూల్చుతున్న ప్రభుత్వమే దోషి అని అన్నారు. "మాకు కేసులు, లాఠీలు కొత్త కాదు. ఎన్ని జైళ్లు కట్టుకుంటావో కట్టుకో రేవంత్.. మేము కొట్లాడేందుకు సిద్ధం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు రోడ్లపై తిరగకుండా చేస్తాం. మీ అల్లుడికి పైసలు కావాలంటే కాంగ్రెస్ నేతలు దోచుకున్న వాటిలో నుంచి ఇవ్వండి.. పేదల వద్ద నుంచి లాక్కుంటామంటే ఊరుకోం" అంటూ బండి సంజయ్ హెచ్చరించారు.

## భద్రాచలం రాములోరిని దర్శించుకున్న గవర్నర్

ప్రధానాలయంలోని ధ్రువమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆంజనేయస్వామి, లక్ష్మీ తాయారు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం పలికారు. గవర్నర్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఈవో రమాదేవి అందజేశారు. అంతకుముందు గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ స్వాగతం పలికారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

వేటు ప్రకటించాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం ఈరోజు విచారణ చేసింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ గౌడ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులున్నా పరిగణలోకి తీసుకోవడంలేదన్నారు. పిటీషనర్ల తరఫు న్యాయవాదులు. దీనిపై ఇవాళ హైకోర్టులో విచారణ జరిగింది. కాగా బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జులై 3న హైకోర్టులో విచారణ జరిగింది. వాదనలు విన్న న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారని.. వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, హుజూరాబాద్? శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డిలు కొద్ది రోజుల క్రితం వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయ

తొలగించాలని పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 21కి వాయిదా వేసింది. తన పరువుకు భంగం కలిగేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ ఆమెపై రూ.100కోట్లకు కేటీఆర్ దావా వేసిన విషయం తెలిసిందే. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించింది. అయినప్పటికీ మంత్రి కొండా సురేఖలో ఎలాంటి మార్పు రాలేదు. తన వ్యక్తిత్వ హననం చేసే విధంగా చేసే ఏ ఆరోపణలను సహించేది లేదని ఇప్పటికే కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై తన గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి ఆయన ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కేసులో కోర్టు తాజా కామెంట్లతో కేటీఆర్ కు బలం చేకూరినట్లయింది. కొండా సురేఖపై దాఖలుచేసిన పరువునష్టం దావాలో కేటీఆర్ ప్రజాప్రతినిధుల కోర్టులో తన వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. మంత్రి మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తనకు, పార్టీ ప్రతిష్ఠకు గండికొట్టాలనే ఉద్దేశంతో అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. బహిరంగంగా అసభ్య పదజాలాన్ని చదవడం మంచిదికాదని, ఆమె చేసిన వ్యాఖ్యలను పిటిషన్‌లో పేర్కొన్నట్టు విన్నవించారు. కావాలని తనపై నిరాధార ఆరోపణలు చేశారని కేటీఆర్ చెప్పారు. ఆ వ్యాఖ్యలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మీడియాలో ప్రసారం అయ్యాయని, ఆ వార్తా కథనాల ద్వారా సాక్షులుగా ఉన్నవారు తీవ్ర కలత చెందారని తెలిపారు. టీవీల్లో, పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో, డిజిజల్ మీడియాలో వచ్చిన వార్తాకథనాలకు సంబంధించిన క్లిప్పింగులను ఫిర్యాదు పత్రానికి జోడించినట్టు వివరించారు.

## 'జనం నోటా ఒకటే స్లోగన్.. వద్దురా నాయన కాంగ్రెస్ పాలన'... కేటీఆర్ విమర్శలు

వచ్చింది-కష్టాలు తెచ్చిందని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎలాంటి బాంబులకు భయపడేది లేదు..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల అరెస్టులు తప్పవని, త్వరలోనే బాంబులు పేలతాయంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎలాంటి బాంబులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. చంద్రబాబు, వైఎస్ఆర్ వంటి వారితోనే పోరాటం చేశామని.. మీరో లెక్కా అంటూ విరుచుకుపడ్డారు. పొంగులేటి బాంబులు తుస్సే అంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. "ఏం పీక్కుంటారో పీక్కోండి.. నీ బాంబులకు భయపడలేదు. కేసులకు భయపడేది లేదు. మేం ఒరిజినల్ బాంబులకే భయపడలేదు. దొంగ కేసులు పెడితే పెట్టుకో. నీ ఈడీ కేసులు, మోడీ కాళ్ళు మొక్కిన బాంబుల గురించి చెప్పు. చంద్రబాబు, వైస్సార్‌తోనే కొట్లాడినం.. ఈ చిట్టి నాయుడు ఓ లెక్కనా. అడ్డమైన కేసులు పెట్టి జైలుకు పంపితే పంపు.. ఆర్ఆర్ టాక్సలపై మేం వచ్చాక లెక్క తెలుస్తాం. సీఎం రేవంత్ బామ్మర్ది, పొంగులేటి బాగోతాలు అన్నీ బయటకు తీస్తాం. చావుకు మేం భయపడం" అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు.

## రేవంత్ నీ సవాల్‌ను స్వీకరిస్తున్నా.. అందుకు మేము సిద్ధమే

రేవంత్‌కు కలపడ్డట్టుంది...

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వాళ్ళు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేశారని.. ప్రజల ఇండ్లకు మార్కింగ్ వేసి ప్రజలను భయపెట్టారని తెలిపారు. కేసీఆర్ దారిలోనే రేవంత్ వెళ్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని.. కానీ పేదల ఇండ్లను కూలిస్తే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ సుందరీకరణ చేసుకోవాలన్నారు. "మూసీ బాధితులు ఎవరైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌కు మూసీ పక్కన ఉండలేకపోతున్నామని చెప్పారా.. మా ఇండ్లు కూల్చమన్నారా. రేవంత్‌కు కలపడినట్టు ఉంది. అయితే ఆ కల లక్షన్నర కోట్లపైన అయి ఉండొచ్చు..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# కరెంటే ఛార్జీలే తెలంగాణ ఉద్యమ పునాది

## - ఇఆర్‌సి బహిరంగ విచారణలో కెటిఆర్ వినతి



రాజన్నసిరిసిల్ల, తెలంగాణ ముచ్చట్లు : కరెంట్ ఛార్జీల పెంపు కారణంగానే తెలంగాణ ఉద్యమం పుట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆనాడు ఛార్జీలు పెంచితేనే కేసీఆర్ ఉద్యమం మొదలుపెట్టారని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే అదే పరిస్థితి తేవటం శోచనీయమని అన్నారు. ఈఆర్సీ ఛైర్మన్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని.. ఈ ప్రాంత బిడ్డగా తెలంగాణ ప్రయోజనాలకు నష్టం చేకూర్చే ప్రతిపాదనలను తిరస్కరించాలని మిమ్మల్ని కోరుతున్నా అని అన్నారు. విద్యుత్ వ్యాపార వస్తువుగా చూడవద్దని.. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా భావించాలని కోరారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు సంబంధించి ఈఆర్సీ సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నా నియోజకవర్గంలోని సెస్ అనేది చాలా ప్రతిష్టాత్మక సంస్థ అని కేటీఆర్ తెలిపారు. దేశంలో సహకార రంగంలో ఉన్న చాలా తక్కువ విద్యుత్ సంస్థల్లో సెస్ ఒక్కటి అని చెప్పారు. మా నేతృత్వంలోని ఇక్కడి సెస్ పాలక వర్గం బ్రహ్మాండంగా పనిచేస్తోందని అన్నారు. డిస్కంలతో పోల్చితే మా సెస్ పనితీరు 100 శాతం మెరుగు అని గర్వంగా చెబుతున్నా అని అన్నారు. గతంలో సెస్ ను రాష్ట్ర ప్రభుత్వంలోని సంస్థల్లో కలపాలని ప్రయత్నిస్తే ఇక్కడి ప్రాంత వాసులు వ్యతిరేకించారని గుర్తుచేశారు. వ్యవసాయ విద్యుత్‌ను 5 నుంచి 7.5 హెచ్‌పీకి పెంచాలని.. 7.5 హెచ్‌పీకి సబ్సిడీ ఇవ్వాలని కోరారు. గతంలో ఎన్‌పీసీడీఎల్ సగటు ధర నిర్ణయించేదని.. కానీ ఆ తర్వాత బల్క్ సప్లయ్ టారిఫ్ ఆధారంగా నిర్ణయిస్తోందని.. సర్ ఛార్జీ కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. సెస్ ను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిపుష్టమైన సబ్సిడీ ఇస్తూ ఎప్పటికప్పుడు ఆ డబ్బు ప్రభుత్వం నుంచి సంస్థకు వచ్చే విధంగా గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత శాసనసభ్యునిగా నేతన్నల సమస్యలు తెలిసిన వ్యక్తిగా మిమ్మల్ని విజ్ఞప్తి చేస్తున్నా అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన నాడు మనం తీవ్రమైన విద్యుత్ కొరతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలు పవర్ హాలిడేస్ వద్దని ఇందిరా పార్క్ వద్ద ధర్నాలకు దిగిన పరిస్థితి ఉండేదని.. మరోవైపు రైతులు కరెంట్ లేక తీవ్ర నిరాశలో ఉన్న పరిస్థితి ఉందని గుర్తు చేశారు. సిరిసిల్లలో కూడా పవర్ లూమ్ పరిశ్రమ కరెంట్‌తోనే ముడిపడి ఉందన్నారు. ఇక్కడ కూడా కరెంట్ లేక ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రతి మనిషికి విద్యుత్‌తో విడదీయరాని సంబంధం ఉందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు పదేళ్ల పాటు విద్యుత్ సంస్థలకు స్వర్ణయుగంగా మారిందని కేటీఆర్ అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చిన 10 నెలల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని తెలిపారు. దానికి తోడు ఇప్పుడు కరెంట్ ఛార్జీల వాతలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాలకులకు విజన్ ఉంటే.. సంపద పెంచి పేదలకు పంచాలి.. కానీ.. ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపి.. సంపద పెంచుకోవాలనే ఆలోచన చేయటం దుర్మార్గమని అన్నారు. డిస్కమ్ లంటే డిస్ట్రిబ్యూషన్ సంస్థలే తప్ప ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదని సూచించారు. విద్యుత్ అంటే వ్యాపారం కాదు.. రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రమని అన్నారు. విద్యుత్ సంస్థల బలోపేతం కోసం చేసే ఖర్చు భారం కాదని.. అది ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. అదనపు ఆదాయం కోసం.. 18 వేల కోట్ల అదనపు భారం మోపాలన్న కాంగ్రెస్ సర్కారు ఆలోచనే ప్రజా వ్యతిరేకమైనదని విమర్శించారు. విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన చార్జీలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని కోరారు. వివిధ కారణాలు చెప్పి 963 కోట్లు అప్ ఛార్జీలను ప్రజలపై భారం వేయాలనుకోవటం సరికాదని హితవు పలికారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా తక్షణం రూ. 12 వందల కోట్లు పెంచుకోవటంతో పాటు డిస్కంలు చేసిన 9 ప్రతిపాదనలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నపుడు పదేళ్ల పాటు రాష్ట్ర ప్రజల మీద ఒక్క రూపాయి భారం వేయలేదని కేటీఆర్ గుర్తుచేశారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్ట్ ఉచితంగా నీళ్లు ఇచ్చినప్పటికీ ఒక్క రూపాయి భారం వేయలేదని అన్నారు. ఇప్పుడు డిస్కంలు చేసిన ప్రతిపాదన పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ఉందని విమర్శించారు. ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. 11కేవీ, 33కేవీ, 220 కేవీ కింద నడిచే పరిశ్రమలకు సంబంధించి అన్నింటిన ఒకే కేటగిరీ లోకి తీసుకురావడం అసంబద్ధమని తెలిపారు. అదానీ ఒక ఫ్యాక్టరీ పెడితే వారికి వర్తించే కేటగిరీనే మా సిరిసిల్లలో సాంచాలు నడిపే పరిశ్రమకు ఉంచాలనుకోవటం హేతుబద్ధమైన నిర్ణయం కాదని అన్నారు. పరిశ్రమలకు సంబంధించి కరెంట్ ను అన్నింటిని ఒకే గాటున కట్టడమంటే సూక్ష్మ చిన్న, మధ్య పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లే అని అన్నారు. ఈ విధమైన కుట్ర చేస్తూ చిన్న పరిశ్రమలకు రాయితీ ఇవ్వకుండా ఉండే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కుంటు పడిందని.. చాలా పరిశ్రమలు తరలిపోతున్నాయని తెలిపారు. ఇంకా ఛార్జీలు పెంచితే పరిశ్రమలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కుటీర పరిశ్రమలు, చిన్న పరిశ్రమలు బేంబేలెత్తేపోతాయని తెలిపారు. కుటీర, చిన్న, పెద్ద పరిశ్రమలను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిస్కంలు చేసిన ప్రతిపాదనలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని అన్నారు.

రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 12 వందల కోట్లు భరించిందని.. ఈ ప్రభుత్వం ఎందుకు భరించదని కేటీఆర్ ప్రశ్నించారు. మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తిడి తెచ్చినా తాము అంగీకరించలేదని తెలిపారు. 10 హెచ్ పీ వరకు సిరిసిల్ల నేతన్నలకు సబ్సిడీ ఇచ్చామన్నారు. నాయి

బ్రహ్మణులు, రజకులకు, ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత విద్యుత్ ఇచ్చే ప్రయత్నం చేశామని తెలిపారు. పదినెలలకే ఎందుకు ఛార్జీలు పెంచే ప్రయత్నం చేస్తున్నారని నిలదీశారు.

# సిరిసిల్లనేతకు ఉరేయవద్దు

## - పవర్‌లూమ్‌కు ఛార్జీలు పెంచవద్దు
## - పెద్ద పరిశ్రమలగాటన చేనేతను చేర్చవద్దు
## - ఇఆర్‌సి విచారణలో స్పష్టంచేసిన కెటిఆర్

రాజన్నసిరిసిల్ల, తెలంగాణ ముచ్చట్లు : సిరిసిల్లలో నేతన్నల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లు బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాం వంటి ఆర్డర్ ఇక్కడి నేతన్నలకు ఇచ్చామని గుర్తుచేశారు. వర్కర్ టూ ఓనర్ పథకం కోసం దాదాపు రూ. 400 కోట్లు ఖర్చు చేశామని.. అప్పెరల్, టెక్స్ టైల్ పార్క్ లను బలోపేతం చేశామని.. మరమగ్గాలను మోడ్రనైజేషన్ చేశామని తెలిపారు. గత పదేళ్లలో సిరిసిల్లలో ఆత్మహత్యలు ఆగిపోయాయని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 10 మందికి పైగా నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో 10 హెచ్ పీ ల వరకు మాత్రమే సబ్సిడీ ఉందని.. దాన్ని 30 హెచ్ పీ వరకు పెంచాలని కోరారు. సిరిసిల్లను మరో తిరుపూర్ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నం చేసిందని చెప్పారు. కానీ ఇప్పుడున్న ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వటం లేదని అన్నారు. వారికి ఆర్డర్లు వచ్చే విధంగా ప్రభుత్వాన్ని కోరాలని ఈఆర్సీ ఛైర్మన్‌ను విజ్ఞప్తి చేశారు. మానవీయ కోణంలో ఆలోచించి ఇక్కడ ఉన్న 10 హెచ్ పీ సబ్సిడీని 30 హెచ్ పీ ల పెంచాలని కోరారు. మొత్తంగా ప్రజలపై 18 వేల కోట్ల భారాన్ని మోపాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. అదే విధంగా డిస్కంల ప్రతిపాదనలను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. సెస్‌ను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మీ తరఫున సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు సంబంధించి బహిరంగ విచారణను మా సిరిసిల్లలో నిర్వహించినందుకు ఈఆర్సీ ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఒక్క సెస్ పరిధిలోనే తీసుకుంటే లక్షా 20 వేలకు పైగా కనెక్షన్లు ఉంటే 75 వేల కనెక్షన్ల వరకు ఎండకాలంలో 300 యూనిట్లకు పైగా వాడుతున్నారని కేటీఆర్ తెలిపారు. కరెంట్ వినియోగమనేది గతంతో పోల్చితే చాలా వరకు పెరిగిందని పేర్కొన్నారు. గత పదేండ్లు స్వర్ణయుగంలా నడించిందని, ఈ పది నెలల నుంచి దినమొక యుగంలా ఉందని చెప్పారు. తమ హయాంలో రైతులపై రూపాయి భారం పడలేదని తెలిపారు. అన్నదాతలకు ఉచితంగా విద్యుత్ అందించామని వెల్లడించారు. ప్రజలపై కరెంటు భారం మోపడం సరికాదన్నారు. సిరిసిల్ల నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని చెప్పారు. అన్నిరకాల పరిశ్రమలకు ఇచ్చే విద్యుత్‌ను ఒకే గాటున కట్టడం కరికాదని చెప్పారు. చార్జీల పెంపుతో కుటీర పరిశ్రమలపై భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఉచిత విద్యుత్ పేరుతో ఉన్న విద్యుత్‌ను ఊడగొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చార్జీల పెంపును అడ్డుకుంటామని, ప్రజా పోరాటానికి వెనుకాడమన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల నడ్డి విరిచేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నదని విమర్శించారు. అదానీ, అంబానీలకు.. సిరిసిల్ల నేతన్నలకు ఒకే కేటగిరి ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

# సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం

## నేటినుంచి అందుబాటులోకి విహార యాత్ర

నాగర్‌కర్నూలు,తెలంగాణ ముచ్చట్లు : నల్లమల అటవీ ప్రాంతం, కొండకోనల మధ్య కృష్ణా నదిలో విహారానికి రాష్ట్ర పర్యాటకశాఖ సిద్ధమైంది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో ఒకేసారి 120 మంది ప్రయాణించేలా డబుల్ డెక్కర్ తరహాలో ఏసీ లాంచీని ఏర్పాటు చేశారు. కృష్ణా నదిలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు (120 కి.మీ) 7 గంటలపాటు లాంచీ ప్రయాణం ఉంటుంది. ఈ లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600 టికెట్ ధర నిర్ణయించినట్లు సోమశిల లాంచీ ఇన్‌ఛార్జి శివకృష్ణ తెలిపారు.

# జిల్లాలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములు చేసి నీటి సంరక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా

ఒంగోలు, తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలో అన్నీ వర్గాల ప్రజలను భాగస్వాములు చేసి నీటి సంరక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్లో జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ఆధ్వర్యంలో భూగర్భ జలాల పెంపుకు చేపట్టాల్సిన నీటి సంరక్షణ చర్యలపై ఎంపిడిఓలు, ఈఓ పిఆర్ అండ్ ఆర్ డి, ఎపిఓలు, ఎపిఎమ్ లు, ఆర్ డబ్ల్యూఎస్. ఇంజనీరింగ్ అధికారులు, సంబందిత శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడుతూ, ప్రకాశం జిల్లా అంటే నీటి సమస్య జిల్లాగా గుర్తుకు వస్తుందని, ఆ అభిప్రాయాన్ని మార్చేలా జిల్లాలో అన్నీ వర్గాల ప్రజలను భాగస్వాములు చేసి భూగర్భ జలాలు పెరిగేలా నీటి సంరక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో మొత్తం 57 గ్రామాలలో పరిమితికి మించి భూగర్భజలాలను వినియోగించినట్లు గుర్తించడం జరిగిందని, వీటిలోని కొన్ని గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్, ఎఫర్డ్ సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాయని కలెక్టర్ తెలిపారు. ఇదే విధంగా జిల్లా లోని అన్నీ గ్రామా పంచాయతీల్లో ఎంత నీరు అందుబాటులో వుంది, ఎంత నీటిని వినియోగించడం జరుగుచున్నది, ఇంకా ఎంత నీటి అవసరం వుంది తదితర విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విలేజ్ వాటర్ బడ్జెట్ ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆ ప్రణాళికలో భాగంగా గ్రామస్తులను భాగస్వాములను చేసి భూగర్భ జలాలు పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఎ విధమైన కట్టడాలు అవసరం తదితర విషయాలను గ్రామస్తుల నుండి సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. తప్పనిసరిగా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి విలేజ్ వాటర్ బడ్జెట్ ప్రణాళిక రూపకల్పన చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణాలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫారంపాండ్ నిర్మాణాలు వంటి అనేక కార్యక్రమాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నదన్నారు. ఈ నిర్మాణాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, నీటి సంరక్షణ కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థలను, ప్రజలను భాగస్వాములు చేసినప్పుడే నీటి సంరక్షణ కార్యక్రమాలు విజయవంతంగా అమలు జరుగుతాయని, సంబంధిత అధికారులు తమ భాద్యతగా భావించి నీటి సంరక్షణ కార్యక్రమాలు వంద శాతం అమలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ అన్నారు.

# మూసీ పునరుజ్జీవం..బాపూ ఘాట్ అభివృద్ధి

## - హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
## - వీటిని అడ్డుకోవాలని చూస్తున్న బిఆర్ఎస్, బిజెపి
## - సిఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్25: మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీజేపీ వ్యతిరేకిస్తోంది. కానీ గాంధీ వారసులుగా అంతర్జాతీయ స్థాయిలో బాపూ ఘాట్‌ను అభివృద్ధి చేసి తీరుతాం. కానీ బీజేపీ, బీఆర్ఎస్ వీటిని ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. సదరన్ రైజింగ్ సమ్మిట్ లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. గాంధీ ఐడియాలజీ కేంద్రం గా బాపూ ఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా నగరంలోని బాపూ ఘాట్ ను అభివృద్ధి చేస్తాం. దేశం మొత్తం మాట్లాడుకుంటున్న సర్దార్ పటేల్ విగ్రహం తరహాలో హైదరాబాద్ లోని బాపూ ఘాట్‌లో మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం అన్నారు. తెలంగాణలో ఫాంహౌస్ పాలిటిక్స్ చేస్తున్నారని, దేశంలో ఎక్కడైనా ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుండా ఉన్నారా..అని ప్రశ్నించారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్యాలెస్ పాలిటిక్స్ చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అధికారం కోల్పోయినా కేసీఆర్ ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా ప్రజల తరఫున గొంతుక అసెంబ్లీలో వినిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై మాజీ సీఎం కేసీఆర్ కు నమ్మకం ఉందా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ తనని తాను ఓ జమీందార్ గా భావిస్తున్నారు. ఇలాంటి వారిని ప్రజలు ఎక్కువ రోజులు సహించరని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీకి, మాజీ సీఎం కేసీఆర్‌కి తాను ఒకటే మాట చెబుతున్నానని.. నిజంగానే అభివృద్ధి జరగాలని భావిస్తే తనతో మాట్లాడాలన్నారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని రాజకీయాలు చేయాలని, దాంతో అభివృద్ధికి ఏ ఆటంకాలు ఉండవన్నారు. తెలంగాణలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను కేంద్రం వ్యతిరేకిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

# సుందరీకరణకు ఓకే...ఇళ్లు కూల్చివేతలకు నో

**- పేదల ఇళ్ల జోలికి వస్తే ఖబర్దార్ - మూసీ సుందరీకరణ పేరుతో స్కామ్ - సుందరీకరణతో డబ్బులు దండుకునే యత్నం**
**- బిఆర్ఎస్ బాటలోనే రేవంత్ సర్కార్ - రాబర్ట్ వాద్రాకు ప్రాజెక్ట్ కట్టబెట్టే యత్నం**
**- మూసీ బాధితులకు మద్దతుగా ధర్నాలో బిజెపి నేతల విమర్శలు**

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : మూసీ సుందరీకరణకుతాము వ్యతిరేకం కాదని,మూసీ పరివాహకంలో పేదలను తరిమివేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని బిజెపి స్పష్టం చేసింది. పేదలకు అన్యాయం జరగకుండా మూసీ సుందరీకరణ చేపడితే తాము కరసేవ కూడా చేస్తామని స్పష్టం చేసింది. మూసీ పేదలకు మద్దతుగా ఇందిరాపార్క్ వద్ద బిజెపి చేపట్టిన ధర్నాలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్, మహేశ్వర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. మూసీ ప్రాజెక్ట్‌కు లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న వారు మూడు నెలల పాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటే ప్రాజెక్టును విరమించుకుంటానంటూ ముఖ్యమంత్రి రేవంత్ చేసిన సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల కోసం వారి ఇళ్లలో నివాసం ఉండేందుకు మేము సిద్ధం అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తి కావస్తోందని.. నిరుపేదలకు ఇచ్చేందుకు ఏ ఇంటికి రేవంత్ సర్కార్ శంకుస్థాపన చేయలేదని, భూమి పూజ చేయలేదని విమర్శించారు. కొత్తగా ఇవ్వకపోగా ఏండ్లుగా నివసిస్తున్న నిరుపేదల ఇండ్లను కూలుస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని.. ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను గారడీలుగా మార్చి మసిపూసి మారేడుకాయ చేశారన్నారు. ప్రజలను సోనియా, రాహుల్, రేవంత్ మభ్యపెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వాళ్ళు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేశారని.. ప్రజల ఇండ్లకు మార్కింగ్ వేసి ప్రజలను భయపెట్టారని తెలిపారు. కేసీఆర్ దారిలోనే రేవంత్ వెళు ్తన్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని.. కానీ పేదల ఇండ్లను కూలిస్తే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ సుందరీకరణ చేసుకోవాలన్నారు. మూసీ బాధితులు ఎవరైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌కు మూసీ పక్కన ఉండలేక పోతున్నామని చెప్పారా.. మా ఇండ్లు కూల్చమన్నారా. రేవంత్‌కు కలపడినట్టు ఉంది. అయితే ఆ కల లక్షన్నర కోట్లపైన అయి ఉండొచ్చు.. కానీ పేద ప్రజలకు మంచి చేయాలనేది మాత్రం కాదు అంటూ వ్యాఖ్యలు చేశారు. మూసీ బాధితులకు అండగా బీజేపీ ఉంటుందని స్పష్టం చేశారు. వారికోసం అవసరమైతే చంచల్ గూడ జైలుకు అయినా, చర్లపల్లి జైలుకు అయినా వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రేవంత్ పోలీసులతో వస్తాడా? ఎలా వస్తాడో కానీ బస్తీల్లోకి రావాలి. ఆయన్ను ప్రజలు ఏమనకుండా మేము రక్షణగా ఉంటాం.. సెక్యూరిటీ విషయంలో ఆయనకు చింత అక్కర్లేదు. డ్రైనేజీ సిస్టం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యం. రేవంత్‌కు పేదలకు కనీస సౌకర్యాలు అందించడం ముఖ్యమా.. మూసీ సుందరీకరణ అవసరమో తేల్చుకోవాలి. వాస్తవానికి మాకు రెండూ ముఖ్యమే.. కానీ ముందు పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించి తర్వాత సుందరీకరణ చేసేవాళ్ళం. కాంగ్రెస్ ప్రభుత్వానికి దిశ, దశ లేదు. ఎలా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటారో కూడా తెలియడం లేదు. ఒక బస్తీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాష్టికానికి ఓ వ్యక్తి గుండెపోటుతో చనిపోయారని తెలిసింది. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఆవేదన చెందకండి.. మీకు అండగా బీజేపీ ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. మూసీప్రాజెక్ట్ అంతా రాబర్ట్ వాద్రా కోసమే అని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు, ఈ ప్రాజెక్ట్ చేపడుతున్నారని అన్నారు. రాబర్ట్ వాద్రా ఇటీవల హైదరాబాద్ వచ్చి గుడిని దర్శించారని అంటున్నారని, అసలు విషయం మూసీ ప్రాజెక్ట్ కోసమేనని అన్నారు. మొన్నటి వరకు హైడ్రా జరిగింది.. ఆ బాధితుల్లో జేసీబీ, బుల్డోజర్లు అనే భయం కనిపించాయి. ఇప్పుడు మూసీ బాధితులను చూస్తుంటే వారిలో బీజేపీ ఉందనే భరోసా కనిపిస్తోంది. కాంగ్రెస్ విధానాలపై ప్రజలకు అండగా ఉండి బరా బర్ కొట్లాడుతాం అని బండి సంజయ్ స్పష్టం చేశారు. మూసీ ఒకప్పుడు మంచినీళ్లు అందించిందని.. ఇప్పుడు విషం కక్కుతోందన్నారు. నేను పాదయాత్ర చేసినప్పుడు కళ్లారా చూశా. మూసీ సర్వ నాశనం కావడానికి కారణం కాంగ్రెస్. పరిశ్రమలకు అడ్డగోలుగా పెట్టుకోవాలని చెప్పి అనుమతి ఇచ్చింది వారు కాదా. మొన్న రేవంత్ లండన్ పోయి ఒక నది చూశాడు.. అది చూసే లక్షన్నర కోట్లు అన్నాడు. నిన్న సియోల్‌కు నేతలను పంపాడు.. వాళ్ళు ఎంత చెప్తారో మరి. రేవంత్.. ముందు మంత్రులను మూసీ పరివాహక ప్రాంతాల్లో తిరగమను. అలా వెళ్తే ప్రజలు

వాళ్ళను గంప కింద కుమ్ముతారనే భయం రేవంత్‌కు ఉంది. రేవంత్ మొన్న మూసీ సుందరీకరణ అని ఒకసారి అంటాడు.. పునరుజ్జీవనం అని ఒకసారి అంటాడు.. ఏంటో ఆయనకే క్లారిటీ లేదు. లక్షన్నర ఖర్చు అన్నాడు.. మళ్ళీ నేను అనలేదు అంటున్నాడు. మూసీ ప్రక్షాళన పేదల కోసం కాదు.. ఇదంతా కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా అల్లుడి కోసమే. బీఆర్ఎస్ నేతలకు దీనిపై మాట్లాడే హక్కు లేదు.. వారిది నోరా.. మోరా అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరు గ్యారెంటీలను డైవర్ట్ చేసేందుకే హైడ్రా, మూసీ అంటూ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఒక డ్రామా కంపెనీ అని.. ఆ పార్టీలో ఎవరికీ వారు సీఎంలంటూ సెటైర్ విసిరారు. సబర్మతి ఖర్చు రూ.7 వేల కోట్లు అని, నమామి గంగ ఖర్చు రూ.40 వేల కోట్లు అయితే మూసీకి లక్షన్నర కోట్లా అని ప్రశ్నించారు. ఒక్క కిలోమీటర్‌కు 2 వేల కోట్లా అని నిలదీశారు. ఇంతకంటే కాస్ట్‌లీ ప్రాజెక్టు.. కాస్ట్ లీ స్కామ్ ప్రపంచంలో లేదన్నారు. దోషులు ప్రజలు కాదు.. అక్రమంగా కూల్చుతున్న ప్రభుత్వమే దోషి అని అన్నారు. మాకు కేసులు, లాఠీలు కొత్త కాదు. ఎన్ని జైళ్లు కట్టుకుంటావో కట్టుకో రేవంత్.. మేము కొట్లాడేందుకు సిద్ధం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు రోడ్లపై తిరగకుండా చేస్తాం. మీ అల్లుడికి పైసలు కావాలంటే కాంగ్రెస్ నేతలు దోచుకున్న వాటిలో నుంచి ఇవ్వండి.. పేదల వద్ద నుంచి లాక్కుంటామంటే ఊరుకోం అంటూ బండి సంజయ్ హెచ్చరించారు. రేవంత్ లంకె బిందెలు ఖాళీగా ఉన్నాయని చెప్పావు కదా.. ఆ లంకె బిందెలు మూసీలో ఉన్నాయా? అంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. బీజేపీ మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ఆ ఇండ్లకు అనుమతి ఇచ్చారని.. ఇప్పుడు ఎలా అక్రమమయ్యాయో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణను ఏటీఎంలాగా మార్చుకోవాలనుకుంటున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్లు, అక్రమ సంపాదన కోసం పేదల ఇండ్లను కూలిస్తే ఉ రుకోబోమన్నారు. మాకు లండన్, సియోల్ అక్కర్లేదు.. మాకు మా హైదరాబాద్ లాగానే ఉంచండి చాలు. గతంలో కేసీఆర్ ఇస్తాంబుల్ లాగా మారుస్తామని చెప్పారు. ఇప్పుడు మీరు లండన్, సియోల్ అంటున్నారు. రేవంత్ సర్కార్‌కు పేదల భూములే కనిపిస్తున్నాయా? ఎంఐఎం నేతలవి కనిపించడం లేదా. పేదలవి కూల్చి.. ఎంఐఎం నేతలవి ఎందుకు కూల్చడం లేదు. డీపీఆర్.. లేకుండా ఎలా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు.. ఎలా కూలుస్తున్నారు. పేదల ఇండ్లు కూలిస్తే ఊరుకునేది లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టివేత

**- రూ.25 లక్షలు విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం - బెంగళూరు, గోవా నుంచి మాదకద్రవ్యాల సరఫరా**
**- నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ వెల్లడి**

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : భాగ్యనగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. దాదాపు రూ.25 లక్షలు విలువ చేసే డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. అలాగే ఇంటర్నేషనల్ ఫడ్లర్, అంతర్రాష్ట్ర ఫడ్లర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుంది. రెండు ప్రాంతాల్లో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. భారీగా డ్రగ్స్ పట్టుబడటంపై శుక్రవారం సీపీ సీపీ ఆనంద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. మాదక ద్రవ్యాలపై హైదరాబద్ పోలీసుల పోరు కొనసాగుతుందని సీపీ స్పష్టం చేశారు. గత నెల రోజుల్లో నార్కోటిక్ పని తీరుపై సమీక్ష చేసి బలోపేతం చేశామన్నారు. డ్రగ్స్ ముఠాలను అదుపు చేయాలని ఆదేశాలు ఇచ్చామని.. సింథటిక్ డ్రగ్స్ బెంగళూరు, గోవా నుంచి సరఫరా అవుతాయని... న్యాచురల్ డ్రగ్స్ ఒరిస్సా, ఛత్తీస్గఢ్, ఏపీ నుంచి సరఫరా అవుతున్నాయని వెల్లడించారు. బెంగళూర్‌పై ముందుగా దృష్టి పెట్టామని.. ఇందులో రెండు ముఠాలను హెచ్ న్యూ పట్టుకుందని తెలిపారు. వీళ్ళు అందరూ కూడా ఆఫ్రికా దేశానికి చెందినవారన్నారు. మొదటి గ్యాంగ్ లో సుడాన్ దేశస్థులు ఇద్దరు ఉన్నారని తెలిపారు. అబ్దుల్ రెహమాన్ నగరంలో కీలకంగా ఉంటూ లోకల్‌గా డ్రగ్స్ డెలివరీ బాయ్‌లాగా వ్యవహరిస్తున్నాడన్నారు. 2014 లో హైదరాబాదుకు స్టూడెంట్ వీసాపై వచ్చాడని.. అప్పటి నుంచి నగరానికి వస్తూ పోతూ ఉ న్నాడన్నారు. గత రెండు సవత్సరాల క్రితం నగరానికి వచ్చి టోలిచౌకీలో ఉంటున్నాడని తెలిపారు. వీసా గడువు ముగిసిన కూడా టోలిచౌకిలో ఉంటున్నాడన్నారు. బెంగళూర్ నుంచి ఖుర్బా అనే సప్లయర్ డ్రగ్స్ ఆర్డర్ తీసుకుంటాడని.. అతనిపై ఇంకా హోల్ సేల్ సప్లయర్స్ ఉన్నారని.. వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. రొమేనియా, టాంజానియా, కేరళ , నైజీరియాకు చెందిన మెయిన్ సప్లయర్‌లు ఉన్నారని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా బెంగళూరులో ఖుర్బా డ్రగ్స్ ఆర్డర్లు స్వీకరిస్తాడన్నారు. హానిన్ అనే వ్యక్తికి డెలివరీ చేయాల్సిన అడ్రస్ చేరవేస్తాడని.. హనిన్ ఇచ్చిన అడ్రస్‌కు రెహమాన్ వెళ్లి డ్రగ్స్ సరఫరా చేస్తాడన్నారు. ఒకరికొకరు కలుసుకోకుండా డ్రగ్స్ సప్లై చేస్తున్నారన్నారు. ఖుర్బాకు నేర చరిత్ర ఉంది. రెహమాన్ ఆపిల్ ఫోన్ సీజ్ చేశాం.. అందులో చాలా వివరాలు ఉన్నాయి. వినియోగదారుల వివరాలు కూడా వచ్చాయి. వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటాం. వారి వద్ద నుంచి సమాచారం సేకరిస్తాం... అవసరం అయితే అరెస్ట్ చేస్తాం అని సీపీ స్పష్టం చేశారు. ఇక రెండవ కేసులో కూడా బెంగళూరుకు సంబంధాలు ఉన్నాయి. ఇమ్రాన్ అనే వ్యక్తి బంజారాహిల్స్ ఉ ంటాడు. మత్తు పదార్థాలకు చిన్నప్పటి నుంచి అలవాటు పడ్డాడు. ఫిబ్రవరిలో యాష్ ఆయిల్ సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. జైలుకు వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు.. ఎండీఎంఏ డ్రగ్స్ సప్లై చేస్తూ పెట్టుబడ్డాడు. ఇమ్రాన్ బెంగళూరుకు వెళ్లి ఓ నైజీరియన్‌తో డ్రగ్స్ సేకరిస్తాడు. డెడ్ డ్రాప్ ద్వారా నందకుమర్ అనే వ్యక్తి నుంచి డ్రగ్స్ సేకరిస్తారు. నంద కుమార్‌ను కూడా అరెస్ట్ చేశాం. నైజీరియన్‌తో పాటు నవీన్ అనే కేరళకు చెందిన వ్యక్తి నుంచి కూడా ఇమ్రాన్ డ్రగ్స్ సేకరిస్తాడు . బెంగళూరులో ఉన్న నైజీరియన్‌ను అరెస్టు చేస్తాం. క్యాష్ ఆన్ డెలివరి డెడ్ డ్రాప్ ద్వారా పేమెంట్ తీసుకుని డ్రగ్స్ సరఫరా చేస్తారని సివి ఆనంద్ తెలిపారు. వినియోగదారుల వివరాలు ఉన్నాయి. వారిని కూడా అదుపులో తీసుకుంటాం. వారి ద్వారా మిగతా కన్స్యూమర్ల వివరాలు కూడా సేకరిస్తాం. నిందితులు డెడ్ డ్రాప్ అండ్ కాంటాక్ట్ లెస్ పద్ధతి ద్వారా డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. సోషల్ మీడియా స్నాప్ చాట్ ద్వారా డ్రగ్స్ ఆర్డర్స్ తీసుకుంటున్నారు. డ్రగ్స్ ఆర్డర్స్ ఏ పద్ధతిలో తీసుకున్న మేము గుర్తిస్తాం. మ్యూల్ అకౌంట్ల ద్వారా ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నట్టు గుర్తించాం. మెయిన్ సప్లయర్లు అందరూ ఫేక్ ఐడెంటీలతో బెంగళూరులో ఉంటున్నారు. ఒరిస్సాలో హ్యాష్ ఆయిల్ తయారు చేస్తున్న ప్రాంతాన్ని గుర్తించాం. ఏపీ పోలీసుల సహకారంతో జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తాం. పట్టుపడ్డ వారిలో సంపన్నుల కుమారులు కూడా ఉన్నారని సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే అత్యాశతో చాలా మంది డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. అనేక సార్లు యువకులు, స్టూడెంట్స్ కూడా డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడిన సందర్భాలు ఎన్నో. విలాసవంతమైన జీవితం గడపాలని, అతి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో యువత ఈ దారిని ఎంచుకున్నట్లు సమాచారం. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. అయితే తాజాగా మరోసారి భాగ్యనగరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. లోకల్ పోలీసులతో కలిసి హెచ్ న్యూ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇంటర్నేషనల్ డ్రగ్ ఫెడ్లర్‌తో పాటు అంతర్రాష్ట్ర డ్రగ్ ఫెడ్లర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హుమయూన్‌నగర్, హెచ్ న్యూ పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. విదేశీ డ్రగ్ పెడ్లర్ నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కంచన్‌బాగ్ పోలీసులకు మరో అంతర్రాష్ట్ర డ్రగ్ ఫెడ్లర్ చిక్కాడు. అతని వద్ద నుంచి 80 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 25 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను హైదరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# బీరు బాటిల్‌లో బల్లి అవశేషాలు - సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తి

వికారాబాద్,తెలంగాణ ముచ్చట్లు :పార్టీ చేసుకుందామని పెద్ద ఎత్తున బీర్లు కొనుగోలు చేసిన ఓ వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. బడ్‌వైజర్ బీరు తాగుదామని ఓపెన్ చేయబోయిన వ్యక్తికి అందులో బల్లి అవశేషాలు కనిపించాయి. దీంతో షాకైన వ్యక్తి.. బాటిల్‌ను ఓపెన్ చేయకుండానే తీసుకెళ్లి తనకు మందు అమ్మిన వైన్ షాపు యజమాని ముందుంచాడు. కానీ తనకేమీ సంబంధం లేదని దబాయించడంతో సదరు వ్యక్తి వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశాడు.వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కేరెల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ రెడ్డి, అనంతయ్య ఇద్దరూ పార్టీ చేసుకోవడానికి రూ.4వేల విలువైన మద్యాన్ని కొనుగోలు చేశారు. మండల కేంద్రంలోని ఓ వైన్ షాపు నుంచి బీర్లతో పాటు వివిధ బ్రాండ్లకు చెందిన మందును తీసుకున్నారు. తీరా పార్టీ చేసుకుందామని బీరు బాటిల్ ఓపెన్ చేయబోతే అందులో ఏదో తేడాగా కనిపించింది. అదేంటని క్షుణ్ణంగా పరిశీలించగా అతని దిమ్మతిరిగిపోయింది. బడ్‌వైజర్ బీరు బాటిల్లో చనిపోయిన బల్లి అవశేషాలు కనిపించాయి. దీంతో ఒక్కసారిగా షాకైన వాళ్లు.. వెంటనే తమకు మందు అమ్మిన వైన్ షాపునకు వెళ్లారు. బీరు బాటిల్‌లో బల్లి ఉందని చూపిస్తే సదరు వైన్ షాపు యజమాని తమకేమీ సంబంధం లేదని దబాయించాడు. కంపెనీ నుంచే అలా వచ్చి ఉంటుంది.. మేమేం చేస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో లక్ష్మీకాంత్ రెడ్డి బీర్ బాటిల్ వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశాడు. ఈ పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది.

# గుడివాడను అత్యుత్తమ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషి -కూటమినేతలు

## -రూ.37 లక్షలతో కార్మిక నగర్ ముస్లిం స్మశాన వాటిక అభివృద్ధికి శంకుస్థాపన చేసిన నేతలు





గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు : గత అనేక దశాబ్దాలుగా అపరిష్కృతముగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, గుడివాడను అత్యుత్తమ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. రూ.37.40 లక్షల నిధులతో గుడివాడ పట్టణం బేతవోలులోని ముస్లిం స్మశాన వాటిక (కబ్రస్థాన్) అభివృద్ధి పనులకు కూటమి నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి ముస్లిం సాంప్రదాయం ప్రకారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధిపై ఎమ్మెల్యే రాము ప్రత్యేక దృష్టి పెట్టి, పనిచేస్తున్నారన్నారు.గత అనేక దశాబ్దాలుగా నియోజకవర్గం లో తిష్ట వేసిన, సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందని నాయకులు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రజల మంచి కోసం పనిచేస్తుందని కూటమి నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, ముల్లపూడి రమేష్ చౌదరి, షేక్ ఇబ్రహీం, పోలాసి ఉమయ్య, షేక్ జానీ షరీఫ్, నిమ్మగడ్డ సత్యసాయి, కామేపల్లి తులసిబాబు, చేకూరు జగన్ మోహన్ రావు, పైడి ముక్కల వంశీ, నీరుడు సురేష్, సయ్యద్ జబీన్,మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, జనసేన పార్టీ నాయకులు పాలంకి సారథి, బోయిన చంటి, సందు పవన్.... ప్రభుత్వ ఖాజీ ఖలీల్ రెహమాన్, ముస్లిం మత గురువు నవీద్ అలం,మజీద్ ఏ మహమ్మదీయ కమిటీ అధ్యక్షులు అమీర్ భాష ,కార్యదర్శి బాబావలి, కోశాధికారి అబ్దుల్ ఖాదర్,మైనార్టీ నేతలు జమీర్ భాష, సయ్యద్ మహబూబ్ అలీ, షేక్ సుభాని సయ్యద్ నజీర్, షేక్ మీరావలి, ఇందిరానగర్ మసీద్ అధ్యక్షులు తాహిర్ భాష, షేక్ షౌకత్, సంషుద్దీన్, షేక్ జాన్ సైదా, బాబన్ సాహెబ్, చోటు, షేక్ అన్సారి, జనసేన నాయకులు నాగూర్ భాష, షేక్ హుస్సేన్, మసీద్ జమాత్ సభ్యులు, కూటమి పార్టీల పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ దీపావళి నుండి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు

## - ఎల్.పి.జి.కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆథార్ కార్డు అర్హతగా ఈ పథకం
## - ఈ నెల 29 నుండి గ్యాస్ బుకింగ్ ప్రారంభం, 31 న ప్రతి ఇంటికే తొలి సిలిండర్ డెలివరీ
## - రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్




అమరావతి, తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఈ దీపావళి నుండే మూడు ఉచిత గ్యాస్ సిలిండ్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, సంబందిత మార్గదర్శకాలను, విధి విధానాలను నిర్థేశిస్తూ నేడే ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేస్తున్నట్లు రాష్ట్ర ఆహార & పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నాల్గోబ్లాక్ ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 31 న రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు లాంచనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, తదుపరి వెంటనే ప్రతి ఇంటికీ మొదటి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఎల్.పి.జి.కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆథార్ కార్డు అర్హతగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు, 1.47 రేషన్ కార్డులు ఉన్నాయని, వీరిలో అర్హులు అందరికీ ఈ పథకం వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం అమలుకై ప్రతి ఏడాది ప్రభుత్వం పై రూ.2,684.75 కోట్ల మేర భారం పడుతుందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కుంటున్నా సరే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకం అమల్లో భాగంగా ఈ నెల 29 నుండి గ్యాస్ బుకింగ్స్ ప్రారంభించడం జరుగుతుంది, గ్యాస్ బుకింగ్ చేసుకోగానే ఒక ఎస్.ఎం.ఎస్. సంబందిత లబ్దిదారుని ఫోన్ నెంబరుకు వెళుతుందని, గ్యాస్ బుక్ చేసుకున్న 24 గంటల్లో పట్టణ ప్రాంతాల్లో, 48 గంటల్లో గ్రామీణా ప్రాంతాల్లో గ్యాస్ సిలిండ్లను డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసిన 48 గంటల్లోనే డి.బి.టి. విధానం ద్వారా లబ్దిదారుల ఖాతాలోని నేరుగా రాయితీ సొమ్ము జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందజేసే మూడు ఉచిత సిలిండర్లలో మొదటి సిలిండర్ మార్చి 31 లోపు, రెండోది జూలై 31 లోపు, మూడోది నవంబరు 30 లోపు ఎప్పుడైనా పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ పథకం అమలుకై ఏడాదిని మూడు బ్లాక్ పీడియడ్లుగా పరిగణించడం జరుగుతుందని, మొదటి బ్లాక్ పీడియడ్ ఏప్రిల్ 1 నుండి జూలై 31 వరకు, రెండో బ్లాక్ పీడియడ్ ను ఆగస్టు 1 నుండి నవంబరు 31 వరకు మరియు మూడో బ్లాక్ పీడియడ్ ను డిశంబరు 1 నుండి మార్చి 31 వరకు పరిగణించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పథకం అమల్లో లబ్దిదారులకు ఏమన్నా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెం.1967 కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం అమలుకు సంబందించి ఇప్పటికే మూడు ఆయిల్ కంపెనీలతో మాట్లాడం జరిగిందని, ఆయిల్ కంపెనీల వద్ద మరియు ప్రభుత్వం వద్ద ఉన్న డాటాను అనుసంధాపరుస్తూ ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం అమలుకై ఆయిల్ కంపెనీలకు అడ్వాన్సుగా రూ.894.92 కోట్లను ఈ నెల 29 న చెక్కు రూపేణా చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెపుతూ రాష్ట్రంలో ఉన్న 1.55 గ్యాస్ కనెక్షన్లలో కేవలం 9.65 లక్షల గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే ప్రధాన మంత్రి ఉజ్వల యోజనా పథకం వర్తింపు అవుతున్నదన్నారు. కాకినాడలో 52 వేల మెట్రిక్ టన్నుల్లో 27 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పి.డి.ఎస్. రైస్ గా గుర్తించడం జరిగిందని, ఇందుకు సంబందించి 11 మందిపై కేసులను కూడా బుక్ చేయడం జరిగిందన్నారు. మాట ఇచ్చిన ప్రకారం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే చెల్లింపులు చేయడం జరుగుతుందని, ఇప్పటి వరకూ 147 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసి 24 గంటల్లోపే దాదాపు రూ.34 లక్షలను చెల్లించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ధరల స్థిరీకరణకై ఒక కమిటీని రాష్ట్ర ముఖ్యమంత్రి వేయడం జరిగిందన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఆ కమిటీకి చైర్మన్ గాను ఆర్థికం, ఆరోగ్య, వ్యవసాయ శాఖల మంత్రులు సభ్యులుగా ఈ కమిటీలో ఉన్నారన్నారు. ఈ కమిటీ ఏర్పాటు అయిన తదుపరి కందిపప్పు రేటును రూ.180/- నుండి రూ.160/-కి తదుపరి రూ.150/-తగ్గించే విధంగా హోల్ సేల్ డీలర్లతో మాట్లాడం జరిగిందన్నారు. ఎవరూ ఊహించని విధంగా రేషన్ డిపోల ద్వారా కేజీ కందిపప్పు కేవలం రూ.67/- లకే అందజేయడం జరుగుచున్నదన్నారు. పామాయిల్ పై ఉన్న కస్టం డ్యూటీని కేంద్రం 7 శాతం నుండి 27 శాతానికి పెంచిన నేపథ్యంలో రూ.92/-ల ఉన్న దాని ధర దాదాపు రూ.130/- లకు పెరిగిందన్నారు. అయితే తమ కమిటీ చొరవతో దాని ధర రూ.110/- లకు తగ్గించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,300 అవుట్ లెట్స్ ద్వారా ప్రజలకు పంపిణీ చేయడం జరుగుచున్నదన్నారు.

# "ఆధునిక భారతం లో యువత పాత్ర కీలకం"

# గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్

## - ఘనంగా ముగిసిన కాశ్మీరీ యువ సమ్మేళనం






గుంటూరు, తెలంగాణ ముచ్చట్లు : ఆధునిక భారతం లో యువత పాత్ర కీలకం అని గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్ననిల్ పవార్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నందు భారత ప్రభుత్వము, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 6 రోజుల పాటు జరిగిన వతన్ కో జానో నాలుగవ కాశ్మీర్ యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమం లో డా. వేణుగోపాలరెడ్డి సెమినార్ హాల్ లో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమం లో కాశ్మీర్ లోని 6 జిల్లాలైన పుల్వామా, బుద్గామ్, శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా మరియు అనంతనాగ్ నుంచి మొత్తం 132 మంది యువతి యువకులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరై న గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నీల్ పవార్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యకలాపాలు, నైపుణ్య అభివృద్ధి, విద్యా మరియు ఉపాధి కలిగించే అవకాశాలపై దృష్టి సారించి దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన సాంకేతిక మరియు పారిశ్రామిక పురోగతికి కాశ్మీర్ నుండి యువతను బహిర్గతం చేయడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుంది అని అన్నారు. ఈ సమ్మేళనం లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలియజేసారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశ వ్యాప్తముగా ఎన్నిక చేయబడిన నెహ్రూ యువకేంద్రాలలో గత నాలుగు సంవత్సరాలుగా కాశ్మీరీ యువ సమ్మేళనం కార్యక్రమం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, కాశ్మీర్ యువకులలో జాతీయ ఐక్యత మరియు సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నదని, అలాగే కాశ్మీరీ యువతకు ఇక్కడ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు తో సహా, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి యువ సమ్మేళనంలో తెలియజేసే అవకాశం దొరికింది అని అన్నారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి సహకరించిన గౌరవ వైస్ ఛాన్సెలర్ గారికి, ప్రతి డిపార్ట్మెంట్ కు మరియు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ విభాగ వాలంటీర్లకు ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దివ్యతేజో మూర్తి, కోఆర్డినేటర్, ఎన్ ఎస్ ఎస్, నెహ్రూ యువ కేంద్ర వైజాగ్ జిల్లా యువ అధికారి జి మహేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్ర కడప జిల్లా యువ అధికారి మణికంఠ గౌరవ అతిథులగ హాజరై ప్రసంగించగా, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా జరిగింది . కాశ్మీర్ నుంచి హాజరైన ప్రతి ఒక్కరికి పార్టిసిపంట్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ విభాగ వాలంటీర్లు మరియు విద్యార్థిని విద్యార్థులు కూడా పాల్గొన్నారు

# గ్రామీణ ప్రజల జీవనోపాదులను మెరుగుపరిచేందుకు హస్త కళలు దోహదం చేస్తాయి



చిన్నాపురం, తెలంగాణ ముచ్చట్లు : గ్రామీణ ప్రజల జీవనోపాదులను మెరుగుపరిచేందుకు హస్త కళలు దోహదం చేస్తాయని, వాటర్ హయసింత్(గుర్రపు డెక్క) కళ పర్యావరణానికి అనుకూలమైనదని, ఈ కళను ఆసక్తిగా నేర్చుకుని మీ పొరుగు గ్రామాల మహిళలకు నేర్పించాలని, తద్వారా మీ జీవనోపాదులు మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శిక్షణ పొందే మహిళలకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేపాక్షి హస్త కళలు సహకారంతో వాటర్ హయసింత్(గుర్రపు డెక్క) కళలో గ్రామీణ మహిళలకు నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ శుక్రవారం బందరు మండలం చిన్నాపురం గ్రామంలో ఎస్టి కాలనీ కమ్యూనిటీ హాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన కొత్తలో ఈ ప్రాంతంలో గుర్రపుడెక్క, కిక్కీసా, తూటికాడ వంటి వాటితో కాలువలు డ్రైనేజీలు నిండిపోయి, నీటి ప్రవాహానికి అవరోధంగా మారి, రైతులకు ఇబ్బందికరంగా మారిందని, దీనిని తొలగించుటకు కోట్లాది రూపాయల వ్యయం చేయవలసిన పరిస్థితులలో, దీనిని ఏ విధంగా వినియోగించవచ్చు ఆలోచించి, నిపుణులతో చర్చించి, కళాకృతుల తయారీలో వినియోగించవచ్చని తెలుసుకుని, ఆ దిశగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత ప్లాస్టిక్ యుగంలో పర్యావరణానికి హానికరం కాని ఎకో ఫ్రెండ్లీగా, ఈ ప్రాంతంలో విరివిగా లభించే గుర్రపుడెక్క వినియోగించి కళాకృతులు తయారు చేయడంలో లేపాక్షి సహకారంతో మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకున్న మహిళలు వారి పొరుగు గ్రామాలు పొరుగు ప్రాంతాల మహిళలకు నేర్పించగలిగే విధంగా ఉండాలని, వారి జీవనోపాదులు మెరుగుపరుచుకోవాలని సూచించారు. మహిళలు తయారుచేసిన కళాకృతులకు లేపాక్షి ఎంపోరియం ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. పెద్ద పెద్ద పరిశ్రమలు కూడా చిన్న చిన్న శిక్షణలతోనే ప్రారంభమవుతాయన్నారు గుజరాత్లో అమూల్ మహిళల సహకారంతోనే దేశవ్యాప్తం అయింది అన్నారు. మహిళలు కలిసికట్టుగా ఐకమత్యంగా బృందాలుగా ఏర్పడి శ్రద్ధతో నేర్చుకోవాలని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. లేపాక్షి హస్తకళల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. విశ్వ శిక్షణ కార్యక్రమం గురించి వివరిస్తూ రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కే సునీత, లేపాక్షి ఎండి బాలసుబ్రహ్మణ్యంరెడ్డిల ఆదేశాల మేరకు వాటర్ హయసింత్ క్రాఫ్ట్ ను ప్రోత్సహించడానికి 2 బ్యాచ్ లలో 20 మంది చొప్పున 40 మంది కళాకారులకు(మహిళలకు) 4 నెలల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఒక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని హ్యాండీక్రాఫ్స్ సర్వీస్ సెంటర్ విజయవాడ కేంద్రం సహాయ సంచాలకులు అపర్ణ మాట్లాడుతూ హస్తకళలు కళాకృతులు తయారీకి లేపాక్షి సహకారంతో శిక్షణ కార్యక్రమాలు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU అనునిత్యం ప్రజల పక్షం TELTEL12273 ముచ్చట్లు తెలుగు దిన పత్రిక

# చదువుకున్న వ్యక్తికి అధికారమిస్తే ఎంత మంచి చెయ్యవచ్చో ఎమ్మెల్యే రాము ప్రత్యక్షంగా చూపిస్తున్నారు:మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు

## -చౌటపల్లి గ్రామంలో రూ.41.20లక్షలతో సీ.సీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే రావి





గుడివాడ రూరల్, తెలంగాణ ముచ్చట్లు : చదువుకున్న వ్యక్తికి అధికారమిస్తే, ప్రజలకు ఎంత మంచి చేయవచ్చో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యక్షంగా చూపిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు.గత ఐదేళ్లగా గుడివాడలో అరాచక పాలన సాగితే, కేవలం ఐదు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అన్నారు.గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి గ్రామంలో రూ. ఐదు లక్షల రూపాయలతో ఫిల్టర్ బెడ్ల మరమ్మత్తు పనులు, రూ.41.20 లక్షలతో గ్రామంలో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు కూటమినేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.

అనంతరం రావి మీడియాతో మాట్లాడుతూ,5ఏళ్లలో అవినీతి తప్ప రోడ్ల అభివృద్ధికి గుప్పెడు మట్టి పొయ్యలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ప్రజలకు త్రాగునీరు కూడా అందించలేకపోయారని ఆయన మండిపడ్డారు. గుడివాడ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాము ఇప్పటికే రెండుసార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారని రావి పేర్కొన్నారు.సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడమే లక్ష్యంగా చంద్రబాబు-పవన్ కళ్యాణ్-మోడీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో అరాచకం రాజ్యమేలితే, 5నెలల కూటమి పాలనలో రాజదాని అభివృద్ధికి, పోలవరం నిర్మాణానికి నిధులు వచ్చాయని.... కోట్లాది రూపాయల నిధులతో విస్తృతంగా అభివృద్ధి పనులుజరుగుతున్నాయని రావి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు కామేపల్లి తులసి బాబు, చేకూరు జగన్మోహన్రావు, ముల్లపూడి రమేష్ చౌదరి , నిమ్మగడ్డ సత్యసాయి, వీరవరపు వంశీకృష్ణ, చౌటుపల్లి గ్రామ టిడిపి నాయకులు అట్లూరి వెంకటరమణ ప్రసాద్ ,అట్లూరి సత్యనారాయణ , వెలగలేటి వీరయ్య వర్రే నాగరాజు ,బండారి సాయిబాబు గుమ్మడి రాజు, పంచాయతీరాజ్ ఎ.ఇ. నూరిబాబు , ఆర్.డ.బ్ల్యు.ఎన్.ఎఇ అట్లూరి వెంకటేశ్వరరావు,ఇ.ఓ.పి.ఆర్.డి శ్రీనివాసరావు ,పంచాయతీరాజ్ కార్యదర్శి హరికృష్ణ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్





మచిలీపట్నం, తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ నవంబర్ 20వ తేదీన జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై రెవిన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాదేశిక నియోజకవర్గం ఆధారంగా ఓటర్ల జాబితా తయారు చేయడం, సజావుగా ఎన్నికల నిర్వహణ చేపట్టటం ఈ ప్రక్రియలో ముఖ్యమైన అంశాలని, దీనిపై ఆయా శాఖల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డివిజన్ స్థాయిలో సైతం ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండి పట్టాదారు భూపత్రాలు కలిగిన రైతులను గుర్తించి ఓటరు జాబితాను రెవెన్యూ సిబ్బంది తయారు చేస్తారని, అదేవిధంగా నీటిపారుదల శాఖ అధికారులు ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారని తెలిపారు. ఎవరైనా ఒక రైతు రెండు ప్రాదేశిక నియోజకవర్గాలలో ఓటు హక్కుకు అర్హత కలిగి ఉంటే రైతు అభీష్టం మేరకు ఏదైనా ఒక ప్రాంతంలో నికరం చేయాలని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. ఏకగ్రీవ ఎన్నిక, చేతులెత్తి ఎన్నుకోవడం, రహస్య ఓటింగ్ వంటి మూడు ప్రక్రియల ద్వారా రైతులు అభ్యర్థులను ఎన్నుకుంటారన్నారని తెలుపుతూ ఆయా నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి ముందు ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొడాలి బాబు, అదేవిధంగా ఓటర్ల జాబితా తయారీపై కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ ఎన్నికలకు కలెక్టర్ జిల్లా ఎన్నికల అథారిటీ, జాయింట్ కలెక్టర్ అదనపు జిల్లా ఎన్నికల అథారిటీగా వ్యవహరిస్తారని, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లకు ఆర్డీవోలు డిప్యూటీ జిల్లా ఎన్నికల అథారిటీగా వ్యవహరిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ ను స్వాధీనం చేసుకొని, అందరి ప్రెస్ క్లబ్ గా మార్చండి

## -రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కి. "ప్రెస్ క్లబ్ అందరిది"సాధన జే. ఏ. సి.వినతి

## -ప్రెస్ క్లబ్ అంటే జర్నలిస్టులు అందరూ ఉంటారు కదా అందులో సంఘాల ప్రమేయం ఏమిటి తెలుసుకుంటా...! మంత్రి పార్ధసారథి





విజయవాడ,తెలంగాణ ముచ్చట్లు : ఏపీయూడబ్ల్యూజే కబంధహస్తాలలో చిక్కుకున్న విజయవాడ ప్రెస్ క్లబ్ ను అందరి ప్రెస్ కప్ గా మార్చవలసిందిగా జర్నలిస్ట్ సంఘాల జేఏసీ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కోలుసు పార్థ సారథి కి వినతి పత్రం అందజేశారు. విజయవాడ లో దాదాపు 2000 కు పైగా అక్రిడేటెడ్ మరియు వర్కింగ్ జర్నలిస్టు లు ఉంటే ఏపీయూడబ్ల్యూజే కబంధ హస్తాలలో చిక్కుకున్న ప్రెస్ క్లబ్ కు వారికి ఇష్టం ఉన్న వ్యక్తులతో 120 మందినీ ఏపీయూడబ్ల్యూజే సభ్యులనే ప్రెస్ క్లబ్ సభ్యులుగా చూపిస్తూ ప్రస్తుతము ఉన్న కార్యవర్గం ఎన్నికైనన్నారు. వారు చూపించే 120 మంది సభ్యులలో పక్క ఉన్న గుంటూరు జిల్లా, ఎక్కడో ఉన్న కర్నూలు జిల్లా వారికి కూడా సభ్యత్వం ఇవ్వటం పట్ల వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆ 120 మెంబర్ షిప్ లలో అనేక పెద్ద పత్రికలకు, అనేక ప్రముఖ ఛానల్ లకు, విజయవాడలో ఉన్న చిన్న, మీడియం పత్రికలకు కనీసం ఒక్క మెంబర్షిప్ కూడా ఇవ్వలేదనీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సభ్యత్వాలు ఇవ్వక పోవటమే కాక ప్రెస్ క్లబ్ ఆదాయాన్ని ఏపీయూడబ్ల్యూజే పేరు మీద నాయకులు తీనివేయటమే కాక, వివిధ ప్రభుత్వ శాఖలకు కోట్లల్లో ప్రెస్ క్లబ్ పేరుమీద బకాయి పడ్డారాన్నారని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రెస్ క్లబ్ మాదే అనేందుకు "ఏపీయూడబ్ల్యూఏ" ఏ రకమైన ఆధారాలు చూపించలేకపోయారని గత సంవత్సరమే కలెక్టర్ కు సబ్ కలెక్టర్ నివేదిక ఇచ్చారని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖలకు బకాయి పడ్డ సొమ్మును ప్రెస్ క్లబ్ మాదే అంటున్న ఏపీయూడబ్ల్యూజే నాయకత్వం నుంచి తక్షణ వసూలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రెస్ క్లబ్ ను కాళి చేయమని ఏపీయూడబ్ల్యూజే నాయకులకు నోటీసులు జారీ చేశారని, ఆ మేరకు ప్రెస్ క్లబ్ ను కాళీ చేపించి, తక్షణమే ప్రభుత్వం అధికారులు, జర్నలిస్టులతో కమిటీ వేయాలన్నారు. అది "అందరి ప్రెస్ క్లబ్ గా మార్చేందుకు" ఆ కమిటీతో సభ్యత్వాలు సేకరించి "ప్రెస్ క్లబ్"విజయవాడ మీడియో మిత్రులందరి "ప్రెస్ క్లబ్" గా మార్చాలని వారు మంత్రి కి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. "ప్రెస్ క్లబ్ అంటే అందరిది కదా..?" అందులో యూనియన్ ల ప్రమేయం ఏమిటో తెలుసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వీర్ల శ్రీ రామ్ యాదవ్,కుర్మా ప్రసాద్ బాబు,చందన మధు,కోటేశ్వర రావు తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం జేఏసీ నాయకులు రాష్ట్ర సమాచార సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్సు శుక్లా ను సెక్రటేరియట్లో కలిసి విజయవాడలో ఉన్న "ప్రెస్ క్లబ్"విజయవాడలో ఉన్న మీడియా మిత్రులందరీ ప్రెస్ క్లబ్ గా మార్చేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటిన గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్






గుడివాడ,తెలంగాణ ముచ్చట్లు : పట్టణ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చిగురుకోట గ్రామానికి చెందిన సరోజిని శాస్త్రి చికిత్స కొరకు రక్తం అవసరం అవడంతో ఆర్కే వారియర్స్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి రక్తదానం చేసి మానవత్వనీ చాటడం జరిగింది.ఈ సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ మాచర్ల రామకృష్ణ మాట్లాడుతూ రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అనే ఆలోచనతో గుడివాడ పట్నంలో అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణానికి కాపాడడం జరుగుతుంది అని అన్నారు, చిగురుకోట గ్రామానికి చెందిన సరోజినీ గారి శాస్త్రి చికిత్స కొరకు అత్యవసరంగా రక్తం అవసరం అవడంతో మమ్మల్ని సంప్రదించగా వెంటనే మా సభ్యులు కరుణ్ కుమార్ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడడం జరిగిందని తెలియజేశారు, అదేవిధంగా చాలామంది రక్తదానం ఇవ్వాలంటే లేని పోనీ అపోహలు మనసులో పెట్టుకొని దూరంగా ఉంటున్నారని దయచేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం ఇవ్వడంతో కొత్త రక్తం ఏర్పడి ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు, మనకి తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మణిస్తారని దయచేసి గుడివాడ పట్నంలోని యువత ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు. సరైన సమయంలో రక్తం అందించడంతో ఆర్కే వారియర్స్ ని సరోజిని గారి కుటుంబ సభ్యులు మరియు వైద్యులు అభినందించడం జరిగింది.

# 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమం సకాలంలో పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్




అనంతపురం,తెలంగాణ ముచ్చట్లు : 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమం అనంతపురం జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ తెలిపారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో 21 వ అఖిలభారత పశు గణనకు సంబంధించిన గోడపత్రాలు, బ్రోచర్లు, స్టిక్కర్లు, సూచన పుస్తకాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశమంతా 21వ అఖిలభారత పశుగణన, ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలన్నారు. జిల్లాలో 6.20 లక్షల కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. పట్టణ ప్రాంతాలలో 3వేల ఇండ్లకు, గ్రామీణ ప్రాంతాలలో 2వేల ఇండ్లకు ఒక ఇనుమేరేటర్ను నియమించడం జరిగిందని, జిల్లాలోని 31 మండలాలలో 493 పల్లెలలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి పశు గణన చేపట్టేందుకు అధికారులు సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పశు గణనలో భాగంగా గణన ప్రక్రియ పూర్తయినట్లు చిహ్నంగా ప్రతి ఇంటి ముందు తలుపు కుడి ఎగువ మూలలో స్టిక్కర్లు అతికించాలని తెలిపారు. ఈ పశుగణన ద్వారా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలతోపాటు వివిధ రకాల కోళ్ళు పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా సమాచారాన్ని సేకరిస్తారన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL12273
తెలుగు దిన పత్రిక
శనివారం 26-10-2024


# దివి నేచర్ ఎన్‌కౌంటర్.. తడిసిన అందాలతో ఇలా..




సోషల్ మీడియా ద్వారా తరచూ తన అందం, ఫిట్‌నెస్ స్టిల్స్ ని షేర్ చేసుకునే దివి, ఈసారి మరో అద్భుతమైన ఫోటోషూట్ తో అభిమానుల మనసు గెలుచుకుంది. ఆమె ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ లో కొన్ని ఫోటోలు పంచుకోగా, వాటిలో స్విమ్మింగ్ పూల్ లో ప్రకృతి ఒడిలో ఆనందంగా విహరిస్తూ కనిపించింది. ఈ ఫోటోలపై అభిమానులు అమితమైన ఆదరణ చూపిస్తూ, ఫిదా అవుతున్నారు. ఇక ఈ ఫోటోలతో పాటు దివి ఇచ్చిన క్యాప్షన్ కూడా అందరి హృదయాలను కదిలించింది. "సహజమైన కొలనులో ఈత కొట్టడం ద్వారా రోజును ప్రారంభించడంలో నిజంగా ఏదో అద్భుతం ఉంది, దాని చుట్టూ ప్రకృతి అందాలు ఆకట్టుకుంటాయి..." అంటూ నేచర్ లో ఉన్న అందాన్ని, ప్రశాంతతను చాలా అందంగా వివరిస్తూ తన ఫీల్ ని వ్యక్తపరిచింది. ఈ పిక్స్ చూస్తేనే మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తుండగా, దివి తన ఫిజిక్ తో కూడా ట్రెండ్ సెట్ చేసింది. ప్రకృతి మధ్యన స్విమ్ చేస్తూ, పూల్ లో నీటిలో తేలుతూ తన ఆనందాన్ని వెలిబుచ్చిన దివి, ఉదయపు కాంతిలో మెరిసిపోతోంది. ఇలా ప్రకృతి అందాలు, పక్షుల చప్పుడు, వీస్తున్న కమ్మని గాలిలో ఆమెకి లభించిన ప్రశాంతత.. అందరిని కట్టిపడేసింది. ఈ మేజికల్ మూమెంట్స్ ఆమె అభిమానులను ఇన్‌స్టాగ్రామ్ లో తెగ ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు, దివి తన పుట్టుక ప్రకృతి దగ్గరకి తిరిగి రావడానికి, అందులోని సౌందర్యాన్ని ఆస్వాదించడానికి, అనుభవించడానికి ఎంత ప్రేమ చూపిస్తుందో కూడా వెల్లడించారు. ప్రస్తుతం దివి ఫిట్‌నెస్, గ్లామర్ ని కేవలం తెరపై మాత్రమే కాదు, సోషల్ మీడియాలో కూడా హైట్ చేస్తూ, తన అభిమానులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటోంది. ఇక ఆమె ఇటీవల పలు సినిమాలతో వెబ్ సీరీస్ లతో ఆకట్టుకుంది. తమిళంలో కూడా ఒక ప్రాజెక్టు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# సినిమా న్యూస్



# ఈ సందేహాలపై కియారా క్లారిటీ ఇచ్చేసింది!




మూంజ్య,స్త్రీ-2 లాంటి భారీ విజయాలతో మడాక్ ఫిల్మ్స్ బాలీవుడ్ లో సంచలన నిర్మాణ సంస్థగా మారిపోయింది. ఈ రెండు విజయాలతో కంటెంట్ బేస్ట్ చిత్రాలు నిర్మించడంలో మడాక్ యూనిక్ సంస్థగా హైలైట్ అయింది. దీంతో ఇప్పుడు హీరోయిన్ల అందరి చూపు ఆసంస్థపైనే పడింది. సదరు నిర్మాణ సంస్థలో ఛాన్స్ వస్తే ముందుగా ఎస్ చెప్పిన తర్వాతే స్టోరీ వినాలని డిసైడ్ అయిపోతున్నారు. తాజాగా కియారా అద్వానీ ఇటీవల దినేష్ విజన్ కార్యాలయంలో కనిపించడం ఆసక్తికరంగా మారింది. దీంతో ఇది ఫ్రెండ్లీ మీట్ నా? లేక ప్రాజెక్ట్ కోసం ఇలా భేటీ అయ్యారా? అన్న డిస్కషన్ నెట్టింట సాగింది. అయితే తాజాగా ఈ సందేహాలపై కియారా క్లారిటీ ఇచ్చేసింది. ఇద్దరు కలిసి ఒక ప్రాజెక్ట్ చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. ఓ కొత్త ఫాంటసీ సినిమా కోసం ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు స్పష్టం చేసింది. అయితే ఇది సూపర్ నేచరల్ యూనివర్స్‌లో భాగం కాదని సహకార ప్రాజెక్ట్ చెప్పుకొచ్చింది. %-%స్త్రీ-2%-% రిలీజ్ కంటే ముందుగానే ఇరువురి మధ్య ఈ రకమైన చర్చలు జరుగుతున్నట్లు అంతర్గత వర్గాలు పేర్కొన్నాయి. ఈ చిత్రం భిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతుంది. ఇది ఓ కొత్త ఫ్రాంఛైజీకి నాంది పలికేలా ఉంటుందిట. అతీంద్రియ అంశాలతో పాటు ఫాంటసీ కామెడీని మిళితం చేసిన కాన్సెప్ట్ అని సమాచారం. స్క్రిప్ట్ సహా అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది చిత్రాన్ని పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారుఏట. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుతం కియారా నటిగా బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో గేమ్ ఛేంజర్‌లో నటిస్తోంది. చరణ్ తో చేస్తోన్న రెండవ చిత్రమిది. అంతకు ముందు వినయ విధేయ రామలో నటించింది. ఆ సినిమా ఫ్లాప్ అయింది. అయినా ఫ్లాప్ తో సంబంధం లేకుండా శంకర్ ఆమెని తీసుకున్నాడు. అలాగే యశ్ రాజ్ ఫిలింస్ లో స్పై యూనివర్స్‌లో భాగమైన వార్ 2 లోనూ కియారా నటిస్తోంది.

# సుధీర్ బ్యూటీ.. మైండ్ బ్లాక్ చేసేసిందిగా!



కోలీవుడ్ బ్యూటీ దివ్య భారతి.. తొలి సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ డమ్ ను సంపాదించుకున్న విషయం తెలిసిందే. జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన బ్యాచిలర్ మూవీతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. మొదటి సినిమాతో సరైన హిట్ అందుకోలేక పోయినా.. యాక్టింగ్ తో మాత్రం మంచి మార్కులు కొట్టేశారు. తన సహజ నటనతో విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు దక్కించు కున్నారు. రొమాంటిక్ సీన్స్ లో ఓ రేంజ్ లో యాక్ట్ చేసి విపరీతంగా ఆకట్టుకు న్నారు. బ్యాచిలర్ మూవీలో సాంగ్స్ ఫుల్ పాపులర్ అయ్యాయి. పెన్నే పెన్నే సాంగ్ తో కుర్రకారును ఫిదా చేశారు దివ్యభారతి. ఆ తర్వాత 2022లో డైరెక్టర్ అంజనా అలీ ఖాన్ దర్శకత్వం వహించిన మధిల్ మేల్ కాదల్ చిత్రంతో మరింత ఫేమస్ అయ్యారు. రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అయిన కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి మహారాజ చిత్రంలో క్యామియో రోల్ పోషించారు. ప్రస్తుతం పలు సినిమాల్లో నటిస్తున్నారు. టాలీవుడ్ లో గోట్ మూవీలో ప్రస్తుతం సుధీర్ సరసన దివ్య భారతి యాక్ట్ చేస్తున్నారు. ఇప్పటికే ఆ సినిమా నుంచి మేకర్స్ విడుదల చేసిన సాంగ్స్, పోస్టర్స్ తో దివ్య భారతి ఆకట్టుకున్నారు. అయితే సినిమాల్లోకి రాకముందు సీరియల్స్, షార్ట్ ఫిల్మ్స్ లో నటించిన ఆమె.. మోడల్ కూడా. అందుకే అందాల ఆరబోతలో తగ్గేదేలే అన్నట్లు సందడి చేస్తుంటారు. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ పిక్స్ తో సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేస్తుంటారు. నెట్టింట దివ్య భారతి గ్లామర్ ఫోటోలు ఎప్పుడూ వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా బ్లాక్ కలర్ స్టైలిష్ డ్రెస్ లో దిగిన పిక్స్ ను షేర్ చేశారు. ప్రపంచంలో ప్రేమ అనేది ఆశ అంటూ క్యాప్షన్ ఇచ్చారు. తన అందాలతో అందరినీ మైమరపించారు.

# శ్రీకాంత్ - రామ్ చరణ్ మధ్య బాండింగ్ ఇలా!



మెగాస్టార్ చిరంజీవిని ఛార్మింగ్ స్టార్ శ్రీకాంత్ అన్నయ్య అని ఎంతో అభిమానంతో పిలుస్తాడు. తన అభిమాన హీరోగా చెబుతుంటాడు. చిరంజీవి సైతం శ్రీకాంత్ ని తమ్ముడుగా భావించి ఎంతో ప్రేమను చాటుతారు. పబ్లిక్ గా ఎన్నోసార్లు ఆ బాండింగ్ బయట పడింది. చిరంజీవి నటించిన సినిమాల్లో శ్రీకాంత్ భాగమయ్యాడు. నేటికి ఆ బాండింగ్ అలా కొనసాగుతుంది. ఇప్పుడు చిరంజీవి, శ్రీకాంత్ తరం దాటి వాళ్ల వారసులు ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. చిరంజీవి తనయుడు రామ్ చరణ్ సినిమాల్లోనూ శ్రీకాంత్ నటిస్తున్నాడు. మరి చిరంజీవితో ఉన్నంత బాండింగ్ రామ్ చరణ్ తో ఉందా? అంటే అంతకు మించి తండ్రి తరహాలోనే తనయుడు అనురాగాలు పంచుతున్నాడని చెప్పొచ్చు. శ్రీకాంత్ ని ...రామ్ చరణ్ అన్నా అని ప్రేమతో పిలుస్తాడు అన్న సంగతి రివీల్ చేసాడు ఛార్మింగ్ స్టార్. ఇంత వరకూ ఈ విషయాన్ని ఎక్కడా చెప్పలేదు. తొలిసారి ఓ ఇంటర్వ్యూలో ఓపెన్ అయ్యారు. అలా సీనియర్ నటులకు చరణ్ ఎంత రెస్పెక్ట్ ఇస్తారు?

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in